ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

శనివారం 24 మే 2025

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్టం	కనిష్టం
నెల్లూరు	39.9	27.9
కావలి	38	28
ఆత్మకూరు	37	26
ఉదయగిరి	37	26
కందుకూరు	37	27

ప్రజాస్వామ్యాన్ని అవమానిస్తున్నారా!?



ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వాన్ని, ప్రజాప్రతినిధులను విద్రోహులుగా మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి చిత్రీకరించడం అంటే ఆయన ప్రజాస్వామ్యాన్ని అవమానిస్తున్నారా? ఇటువంటి వ్యక్తులకు మరో అవకాశం లేకుండా చేయాల్సిన బాధ్యత అందరిపై ఉంది. నియోజకవర్గ, జిల్లాస్థాయిల్లో జరిగిన మహానాడుల్లో చేసిన తీర్మానాలను ప్రభుత్వానికి, పార్టీకి పంపడమే కాకుండా వాటిని సాధించుకోవాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపై ఉంది. జిల్లాలోని నేతలంతా కలిసి ఇందుకు కృషి చేస్తాం. జిల్లా అభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నాయి. వాటిని అందిపుచ్చుకోవాలి.

- ఆనం రామనారాయణరెడ్డి, దేవదాయ శాఖ మంత్రి

ఏడాదిలో యూజీడీ, తాగునీటి పథకాలు పూర్తి



2014-19 మధ్య కాలంలో నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో రూ.5200 కోట్లతో అభివృద్ధి పనులు చేశాం. ఇప్పుడు కూడా అదేస్థాయిలో నెల్లూరును అభివృద్ధి చేస్తాం. ఏడాదిలోపు భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పథకాలను పూర్తి చేస్తాం. నగరంలోని పార్కులు, స్కూళ్లలో మౌలిక వసతులు మెరుగుపరుస్తాం. కార్యకర్తలకు ఎప్పుడూ అండగా నిలుస్తాం. గత ప్రభుత్వం అనేక మందిని వేధించింది. నాడు బెదిరించారు, లాక్కున్నారు, కూలగొట్టారు, జైల్లో పెట్టారు. ఇటువంటి అరాచక పాలనకే వైసీపీని ప్రజలు తరిమికొట్టారు. నేడు చంద్రబాబు నాయుడు ప్రజా పాలన సాగిస్తున్నారు.

- పొంగూరు నారాయణ, మున్సిపల్ శాఖ మంత్రి

కార్యకర్తలకు తోడుగా ఉంటా



తెలుగువారి ఆత్మగౌరవ నినాదంతో నాడు ఎన్టీ రామారావు టీడీపీని స్థాపిస్తే నేడు చంద్రబాబు ముందుకు తీసుకెళుతున్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారు. అందరం ఆయనకు అండగా నిలవాలి. కష్టకాలంలో టీడీపీ కార్యకర్తలు చాలా ఇబ్బందులు పడ్డారు. నేను ఆ కార్యకర్తలకు తోడుగా ఉంటా. రాజకీయంగా ఇబ్బంది పడ్డ వారు నా దగ్గరకు రావచ్చు. వారికి నా వంతు సహకారం ఉంటుంది. కొత్తగా పార్టీలోకి వచ్చిన వారు కూడా పాత వారితో కలిసి నడవాలి.

- వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ

2029లో వైసీపీకి అంత్యక్రియలు



నెల్లూరులో సారా ఉద్యమం జరుగుతున్నప్పుడు నేను ఆ ఉద్యమానికి కన్వీనర్‌గా ఉన్నాను. నాడు ఎన్టీఆర్ ఈ ఉద్యమంలో పాల్గొనేందుకు నెల్లూరుకు వచ్చారు. అప్పుడు ఇచ్చిన మాట ప్రకారం సీఎం అవ్వగానే మద్య పాన నిషేధం అమలు చేశారు. ప్రస్తుతం దేశంలో చంద్రబాబు వంటి విజనరీ లీడర్ లేరు. రాష్ట్ర భవిష్యత్ కోసం కష్టపడే నాయకుడు లోకేష్. వీరితో కలిసి పనిచేయడం గొప్ప గౌరవం. 2029లో వైసీపీకి ప్రజలు అంత్యక్రియలు చేయబోతున్నారు.

- సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు



నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ మహానాడులో అభివాదం చేస్తున్న మంత్రులు ఆనం, నారాయణ, ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలు



మహా ఉత్సాహం

ఘనంగా నెల్లూరు పార్లమెంటు టీడీపీ మహానాడు ● హాజరైన మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు

నియోజకవర్గ తీర్మానాలు ప్రవేశపెట్టిన ఎమ్మెల్యేలు ● జిల్లాస్థాయిలో 11 తీర్మానాలకు ఆమోదం

నెల్లూరు, మే 23 (ఆంధ్రజ్యోతి) : తెలుగు తమ్ముళ్లలో ఉత్సాహం ఉరకలెత్తింది. నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమం శుక్రవారం అట్టహాసంగా జరిగింది. జిల్లాలోని అన్ని మండలాల నుంచి తరలివచ్చిన కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులతో వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్ కళకళలాడింది. గొలగమూడి రోడ్డు మొత్తం పసుపుమయమైంది. నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం ఉదయం 9 గంటలకు ప్రతినిధుల నమోదు ప్రక్రియతో ప్రారంభమైంది. ఆ తర్వాత ముఖ్య నేతలంతా టీడీపీ జెండాను ఆవిష్కరించారు. తదుపరి స్వర్గీయ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు కార్యక్రమాల్లో తీర్మానించిన అంశాలను ఎమ్మెల్యేలు ప్రవేశపెట్టారు. ముందుగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన నియోజకవర్గ తీర్మానాలను ప్రవేశపెట్టారు. వాటిని నెల్లూరు పార్లమెంటు కార్యదర్శి కనపర్తి గంగాధర్ బలపరిచారు. ఇంటూరి నాగేశ్వరరావు ప్రవేశపెట్టిన



మహానాడులో పాల్గొన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

కందుకూరు తీర్మానాలను టీడీపీ నేత చదలవాడ కొండయ్య బలపరిచారు. దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి ప్రవేశపెట్టిన కావలి తీర్మానాలను పెన్నా డెల్టా వైస్ చైర్మన్ బీద గిరిధర్ బలపరిచారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రవేశపెట్టిన కోవూరు తీర్మానాలను పెన్నా డెల్టా చైర్మన్ గోపిరెడ్డి బలపరిచారు. కాకర్ల సురేష్ ప్రవేశపెట్టిన ఉదయగిరి తీర్మానాలను మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి బలపరిచారు. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ ప్రవేశపెట్టిన సిటీ నియోజకవర్గ తీర్మానాలను మాజీ మంత్రి తాళ్లపాక రమేష్‌రెడ్డి బలపరిచారు. చివరగా ఆత్మకూరు తీర్మానాలను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రవేశపెట్టారు. ఇలా ఎమ్మెల్యేలంతా ప్రవేశపెట్టిన తీర్మానాలను ఏకగ్రీవంగా పార్లమెంటు మహానాడులో ఆమోదించారు. అనంతరం జిల్లాస్థాయికి సంబంధించి 11 తీర్మానాలను ఆమోదించారు. వీటన్నిటినీ ఈ నెల 27 నుంచి కడపలో జరగనున్న రాష్ట్ర మహానాడులో ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొమ్మి లక్ష్మయ్యనాయుడు, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీదాటి రాధయ్య, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, మాలేపాటి సుబ్బానాయుడు, మెట్టుకూరు ధనుంజయరెడ్డి, పార్టీ నేతలు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, తాళ్లపాక అనురాధ, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, చెంచలబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

రాక్షస పాలన అంతమైంది



నాడు వైసీపీని ఎదుర్కొనేందుకు కార్యకర్తలతో కలిసి అనేక పోరాటాలు చేశాం. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా పదికి పది స్థానాలు గెలిచాం. నెల్లూరు జిల్లా ప్రజల అభిమానాన్ని సంపాదించాం. సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే నెల్లూరు పార్లమెంటు అగ్రగామిగా నిలిచింది. కష్టకాలంలో పనిచేసిన కార్యకర్తల కష్టాన్ని విస్మరించలేము. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడిన కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించాలని మంత్రులు, ఎమ్మెల్యేలను కోరుతున్నాను.

- షేక్ అబ్దుల్ అజీజ్, నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు

తీర్మానాలు

1. జిల్లావ్యాప్తంగా తాగు నీరు సరఫరా చేసేందుకు జల జీవన్ మిషన్ కింద రూ.8,398 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపి ఉన్నారు. దీనిని వెంటనే మంజూరు చేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం.

2. డెల్టా, నాన్‌డెల్టా ప్రాంతాల్లో రెండు పంటలకూ నీరిచ్చేలా సోమశిల-తెలుగుగంగ ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని కోరడం.

3. గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలి.

4. కొత్త కలెక్టరేట్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలి.

5. కనుపర్తిపాడు వద్ద 28 ఎకరాల్లో ఏసీఏ క్రికెట్ స్టేడియాన్ని నిర్మించేందుకు అవసరమైన చర్యలు చేపట్టడం.

6. దగదర్తి ఎయిర్‌పోర్టును త్వరితగతిన పూర్తి చేయాలి.

7. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు అవసరమైన నిధులు మంజూరు చేయడం

8. నెల్లూరు రూరల్‌లో పొట్టేపాలెం కలుజుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి.

9. ముత్తుకూరు మండలం నేలటూరులో ఫిషింగ్ జెట్టీని మారిటైమ్ బోర్డు పూర్తి చేసేలా ప్రభుత్వాన్ని కోరడం.

10. టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావుకు భారత రత్న ఇవ్వాలని కేంద్రాన్ని కోరడం

11. పహల్గాం ఉగ్రదాడిలో అసువులు బాసిన అమాయకులకు సంతాపం తెలుపుతూ తీర్మానాలు చేశారు.

6 గంటలు.. 43 ప్రశ్నలు

● పైలాన్ ధ్వంసం కేసు విచారణ

● మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌ను ప్రశ్నించిన పోలీసులు

● అన్నిటికీ దాటవేత .. తనకు తెలియదంటూ సమాధానం

● మరోసారి విచారణకు పిలిచే అవకాశం

● స్టేషన్ వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు

కావలి, మే 23 (ఆంధ్రజ్యోతి) : కావలిలోని అమృత్ పథకం పైలాన్ ధ్వంసం కేసులో మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని శుక్రవారం పోలీసులు ఆరుగంటలపాటు ఏకధాటిగా ప్రశ్నించారు. అనధికార సమాచారం ప్రకారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 43 ప్రశ్నలు సంధించి, సమాధానాలు రాబట్టినట్టు తెలిసింది. పైలాన్ ధ్వంసం కేసులో నిందితుడిగా ఉన్న ప్రతాప్‌రెడ్డి హైకోర్టు నుంచి కండీషన్ బెయిల్‌ తెచ్చుకుని ఉన్నారు. పోలీసులు ఎప్పుడు పిలిచినా విచారణకు రావాలని నిబంధనలు విధించి ఉన్నారు. దీంతో పోలీసులు పిలవగానే శుక్రవారం ఉదయం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. లోప సీఐ గిరిబాబు ప్రతాప్‌కుమార్‌రెడ్డిని విచారించారు. కాగా, వైసీపీ నాయకుల హడావుడి ఉంటుందనే ఉద్దేశంతో పోలీసులు ముందస్తుగా స్టేషన్ పరిసరాలలో బందోబస్తు ఏర్పాటు చేశారు. స్టేషన్ రోడ్డుకు ఇరువైపులా బారికేడ్లు కట్టి అటువైపు ఎవరూ రాకుండా కట్టడి చేశారు. అలాగే స్టేషన్ ముందు ఒకటో పట్టణ, రూరల్, సర్కిల్ సీఐలు ఫిరోజ్, రాజేశ్వరరావు, పాపారావులతో భద్రతా చర్యలు చేపట్టారు. వైసీపీ నాయకులు కొంతమంది ఉదయగిరి రోడ్డులోనే చెట్ల కింద ఆగి తమ నాయకుడు ఎప్పుడు వస్తాడా అని ఎదురు చూస్తూ ఉండిపోయారు. ఉదయం 10.30 గంటలకు స్టేషన్‌కు వెళ్లిన ప్రతాప్‌రెడ్డిని సాయంత్రం 5 గంటల వరకు విచారణ చేపట్టారు. మధ్యలో కొంతసేపు భోజన విరామం ఇచ్చారు. పైలాన్ ధ్వంసానికి సంబంధించి సుమారు 43 ప్రశ్నలను విచారణాధికారి అడిగినా వాటికి సరైన సమాధానం చెప్పకుండా తాను లేననీ, తనకు తెలియదని మాత్రమే సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. దీంతో పూర్తి సమాచారం రాబట్టేందుకు మరోసారి విచారణకు పిలిచే అవకాశాలు ఉన్నట్లు పోలీస్ వర్గాల ద్వారా తెలుస్తోంది. అయితే విచారణాధికారిగా ఉన్న సీఐ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి కారు రాగానే ఆయన వద్దకు వెళ్లి ఆహ్వానించినట్లుగా స్టేషన్‌లోకి తీసుకువెళ్లడం విమర్శలకు తావిచ్చింది.



మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డిని పోలీస్‌స్టేషన్‌లోకి తీసుకెళుతున్న సీఐ గిరిబాబు



పోలీస్‌స్టేషన్ రోడ్డులోకి ఎవరూ రాకుండా ఏర్పాటు చేసిన బారికేడ్లు

● కక్ష పూరితంగానే ఇరికించారు!

పైలాన్ ధ్వంసం కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని, కేవలం టీడీపీ నాయకులు కక్ష పూర్తి ధోరణిలో ఉద్దేశపూర్వకంగా కావాలని తనను ఇరికించారని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. విచారణ అనంతరం స్టేషన్ నుంచి బయటకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో ఎప్పుడో కూల్చిన పైలాన్ కేసు మూసివేయగా దానిని రీఓపెన్ చేయించి తనతోపాటు కొందరు వైసీపీ నాయకులను, అప్పట్లో తమకు అనుకూలంగా ఉన్న మీడియా వారిని ఇరికించారన్నారు. ఈ కేసుతో తమకు ఎలాంటి సంబంధంలేదని, తాము నిర్దోషిగా బయటకు వస్తామన్నారు.

నేరస్థులపై కఠినంగా వ్యవహరించాలి

జిల్లా పోలీస్ అధికారులతో ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి



సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

నెల్లూరు(క్రైం), మే 23 (ఆంధ్రజ్యోతి) : నేరస్థులను ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించరాదని, వారిపై కఠినంగా వ్యవహరించాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం నెల్లూరుకు వచ్చిన ఆయనను పోలీసు అతిథి గృహంలో ఎస్పీ జీ కృష్ణకాంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఐజీ పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. రౌడీ షీటర్లు, పాతనేరస్థుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, యాక్టివ్ రౌడీషీటర్లపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని ఆదేశించారు. మత్తు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను కట్టడి చేయాలని సూచించారు.

పంచాయతీ శాఖలో

బదిలీల సందడి

● జూన్ 2 వరకు దరఖాస్తులు

● సిఫారసు కోసం నేతల చుట్టూ ప్రదక్షిణ

నెల్లూరు,(జడ్పీ), మే 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పంచాయతీ శాఖలో బదిలీల ప్రక్రియ మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వం బదిలీలకు అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకోవటంతో పంచాయతీ శాఖలో అధికారులు, ఉద్యోగుల్లో అలజడి నెలకొంది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అర్హత ఉన్న ఉద్యోగుల జాబితాను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఒకేచోట ఐదేళ్లు పని చేసిన వారందరికి స్థానచలనం కలగనుంది. దీంతో ప్రతి గ్రామ పంచాయతీ, మండలాల పరిధిలో ఐదేళ్లు పని చేసిన వారి జాబితాలను సిద్ధం చేసి పంపాలని ఎంపీడీవోలకు ఇప్పటికే అదేశాలందాయి. దీంతో యుద్ధప్రాతిపదికన అధికారులు జాబితాను సిద్ధం చేస్తున్నారు. అలాగే ఐదేళ్లు పూర్తయిన వారు కూడా తమకు నచ్చిన చోట బదిలీ కోరుతూ దరకాస్తులు చేసుకుంటున్నారు. వీరందరిని జూన్ 2వ తేదీలోపు దరకాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

● సిఫారసు కోసం పైరవీలు

సాధారణ బదిలీలు అయినా ఎమ్మెల్యేలు, స్థానిక నేతల సిఫారసు లేనిదే బదిలీలు ఉండవని భావిస్తున్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఆ లేఖల కోసం పెద్దఎత్తున పైరవీలు చేసుకుంటున్నారు. కాగా, సచివాలయాల ఉద్యోగుల బదిలీలకు ఇంకా ప్రభుత్వం నుంచి విధి విధానాలు రాలేదు. ఐదేళ్లు ఒకేచోట పని చేసిన వారితోపాటు మిగతా వారికి అవకాశం కల్పించడంతో బదిలీలపై వెళ్లాలనుకుం టున్న వారంతా ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. పంచాయతీ శాఖలో డీఎల్‌పీవోల నుంచి కార్యదర్శుల వరకు స్థానభ్రంశం కలగనుంది.

కాఫీ, టీ, బిస్కెట్.. అన్నీ ఆన్‌లైనే!

భారీగా పెరిగిన నగదు రహిత చెల్లింపులు

స్మార్ట్ ఫోన్‌తోనే లావాదేవీలు

యూపీఐ, నెట్ బ్యాంకింగ్‌తో కొనుగోళ్లు

పెద్ద నోట్ల రద్దు.. కొవిడ్ ప్రభావం...

సాంకేతిక విప్లవంతో తగ్గిన నగదు చెలామణి

8



కామాక్షితాయికి రావణ సేవ

బుచ్చిరెడ్డిపాళెం, మే 23 (ఆంధ్రజ్యోతి): జొన్నవాడలో జరుగుతున్న శ్రీ మల్లికార్జున స్వామి, కామాక్షితాయి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఆదిదంపతులు రావణుడిపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. మంగళమేళాలు, వేదమంత్రోచ్చరణల నడుమ గ్రామోత్సవం జరిగింది. స్థానిక భక్తులు అడుగడుగునా మామిడితోరణాలు, అరటి పిలకలతో స్వాగత ద్వారాలు ఏర్పాటుతో చలువపందిళ్లు వేసి స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చి పూజలు నిర్వహించి ప్రత్యేక నివేదనలు సమర్పించుకున్నారు. ఇలా శనివారం తెల్లవారుజాము వరకు ఈ గ్రామోత్సవం సాగింది. దాతల సహకారంతో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఉత్సవ కమిటటీ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఈవో శ్రీనివాసులురెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అనధికార విద్యుత్ కోతలతో రైతుల అవస్థలు

తోటపల్లిగూడూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొట్లపూడి, తోటపల్లి గూడూరు, నరుకూరు, సాలిపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో అనధికార విద్యుత్ కోతలతో రైతులు అవస్థలు పడుతున్నారు. వ్యవసాయానికి అందవలసిన 9గంటల విద్యుత్ సరఫరాలో అనధికార విద్యుత్ కోతల కారణంగా పొలాలకు నీరు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ సమస్యను సత్వరమే పరిష్కరించాలని మండల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

బంగారం, వెండి ధరలు



బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9208
వెండి కిలో ధర	రూ. 100,000
వెండి ఒక గ్రాము	రూ. 103.00

'అసైన్‌మెంట్' మాటేమిటి?

- గత ప్రభుత్వంలో 10 వేల ఎకరాలు పంపిణీ
- వైసీపీ నాయకులకు కట్టబెట్టినట్లు ఆరోపణలు
- గ్రామసభలు లేకుండానే అసైన్‌మెంట్ ఆమోదం
- పొదలకూరులో విస్తుగొలిపే నిజాలు
- అక్రమాలు వెలుగుచూస్తున్నా విచారణేది?

పొదలకూరు మండలం సూరాయపాలెంలోని ఎల్‌పీ నంబర్ 950లో 28 ఎకరాలు మేత పోరంబోకు భూమిజూజీ వైసీపీ ప్రభుత్వం చివర్లో 46 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీల పేర్లపై అసైన్‌మెంట్ కింద పట్టాలు పంపిణీ చేసినట్లు రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేశారు. గ్రామసభ నిర్వహించకుండానే ఈ భూ పంపిణీని ఆమోదించారు. అయితే ఇప్పుడు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో రెవెన్యూ అధికారులు సూరాయపాలెం గ్రామంలో విచారణ చేపట్టారు. 46 మంది లబ్ధిదారుల్లో 23 మందిని విచారించగా ఒకరికి కూడా వారి పేరు మీద పట్టా ఇచ్చినట్లు తెలియదు. మిగిలిన 23 మందిని విచారించాల్సి ఉంది. తీరా ఆ భూమి స్వభావాన్ని చూస్తే మొత్తం భూమి వైసీపీ నేతల అనుభవంలో ఉండటం కొసమెరుపు. భూపంపిణీలో జరిగిన అక్రమాలకు ఈ వ్యవహారం ఒక ఉదాహరణ మాత్రమే. ఇటువంటి అక్రమాలు జిల్లాలో అనేకం ఉన్నాయి. పొదలకూరు మండలం మరుపూరు గ్రామంలో అయితే ఏకంగా ఓ భూస్వాముల కుటుంబాలకు 50 ఎకరాల వరకూ ప్రభుత్వ భూమిని ధారాదత్తం చేశారు. ఇలా జిల్లావ్యాప్తంగా ఒక్కొక్కటిగా గత ప్రభుత్వంలో అసైన్‌మెంట్ పట్టాల పంపిణీ మాటున జరిగిన అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. జిల్లాలో సుమారు పది వేల ఎకరాల వరకూ ప్రభుత్వ భూమిని పంపిణీ చేశారని అంచనా. అయితే ఈ అక్రమాలను తేల్చేందుకు ఉన్నతాధికారులు వెనకడుగు వేస్తున్నారు.

● గ్రామసభలు లేకుండానే..

గత ప్రభుత్వంలో జిల్లాలో జరిగిన అతిపెద్ద కుంభకోణమైన అసైన్‌మెంట్ పట్టాల పంపిణీ వ్యవహారంపై ఇంతవరకూ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. పేదలు కాకపోయినా వైసీపీ నాయకులు అనే అర్హతతో గత ప్రభుత్వంలో ప్రభుత్వ భూములను ధారాదత్తం చేశారు. కొండపోరంబోకులు, చెరువు పోరంబోకులు వంటి భూములనూ కట్టబెట్టారు. నిబంధనల ప్రకారం భూమిలేని నిరుపేదలకు భూమిని ఇవ్వాలంటే అందుకు ఒక విధానం అంటూ ఉంది. కానీ దానిని పక్కనపెట్టి గత ప్రభుత్వంలో అసైన్‌మెంట్‌ను ఆమోదించారు. అసలు జిల్లాలో ఏ గ్రామంలో ఎవరికి భూములిచ్చారు? ఎంత భూమిని పంపిణీ చేశారు? అన్నది ఇప్పటికీ తెలియదంటే అతిశయోక్తి కాదు. భూ పంపిణీ చేసే ముందు గ్రామసభలు నిర్వహిస్తారు. అవేమీ లేకుండా గుట్టుచప్పుడు కాకుండా అసైన్‌మెంట్ వ్యవహారాన్ని కానిచ్చేశారు. ఇందులో ఉన్నతాధికారులు కూడా పాత్ర వహించడం గమనార్హం. కూటమి ప్రభుత్వం వచ్చాక పొదలకూరు మండలంలో జరిగిన అక్రమ వ్యవహారాలపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో అక్కడ విచారణ జరిగింది. అప్పటి తహసీల్దార్‌ను బాధ్యుడిని చేస్తూ సస్పెండ్ చేసి చేతులు దులుపుకున్నారు తప్ప తదుపరి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికీ అక్రమార్కుల చేతుల్లో ఉన్న ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకోలేదు. ఒక్క పొదలకూరు మండలంలోనే ఇంత పెద్ద ఎత్తున అక్రమాలు బయటపడితే ఇక జిల్లా మొత్తం ఎన్ని వందల, వేల ఎకరాల కొట్టేశారో అర్థం చేసుకోవచ్చు.

- నెల్లూరు, ఆంధ్రజ్యోతి

బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



డ్రాప్ అవుట్స్ నివారణపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య

రాపూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య సూచించారు. ఐసీడీస్ సిడిపివో సునందా ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని వేపినాపి సెక్టారు చల్లటూరు ఎస్టీ అంగన్వాడీ కేంద్రంలో డ్రాప్ అవుట్స్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సౌజన్య మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరినీ నూరు శాతం బడుల్లో చేర్పించేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ సిబ్బంది, కిశోర బాలికలు పాల్గొన్నారు.

రీసర్వేకు రైతులు సహకరించాలి



కోడూరు బిట్-2లో సర్వే చేస్తున్న రీసర్వే ఇన్‌స్పెక్టర్

తోటపల్లి గూడూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడూరు బిట్-2లో జరుగుతున్నరీ సర్వేకు రైతులు సహకరించాలని జిల్లా సర్వే ఇన్‌స్పెక్టర్ రఘు రామరాజు, జిల్లా రీసర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సత్య నారాయణరెడ్డి సూచించా రు. ఈసందర్భంగా కోడూరు బిట్-2లో జరుగుతున్న రీసర్వేను శుక్రవారం వారు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు దగ్గర ఉండి సర్వే చేయించుకోవాలని, ముందుగానే వారి డాక్యుమెంట్లను గ్రామ సర్వేయర్లకు అందజే యాలని కోరారు. రైతులందరూ సహకరిస్తేనే రీసర్వే సాఫీగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ మహబూబ్ బాషా, గ్రామ సర్వేయర్‌లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ తిరంగా ర్యాలీ



మాట్లాడుతున్న ఎస్ఎస్ఆర్ నాయుడు

సైదాపురం, మే 23(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నీతి, నిజాయితీగా పాలన చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షురాలు సరస్వతి, జిల్లా నాయకుడు చాంద్‌ఖాసీం పాల్గొన్నారు.



గ్రామోత్సవంలో సీతారామస్వామి

ఘనంగా సీతారాముల గ్రామోత్సవం

సంగం, మే 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక బజార్ సెంటర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతిని పురస్కరించుకుని గురువారం అర్ధరాత్రి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆంజనేయస్వామి, సీతారాముల ఉత్సవ విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రభుత్వం మారినా.. తొలగించని జగన్ ఫొటోలు

ఏఎస్ పేట, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారి దాదాపు సంవత్సరం అవుతున్నా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోతో ఉన్న పోస్టర్లు తొలగించకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ద్వారా ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటుచేశారు. కానీ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పేరుతో దర్శనం ఇవ్వడంతో అధికారుల తీరును పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



ఏఎస్ పేట పీహెచ్‌సీలో జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోతో ఉన్న ఆరోగ్యశ్రీ హెల్ప్ డెస్క్

ఆక్రమణలో చెరువులు

నీటి కోసం మూగ జీవాల అవస్థలు

తోటపల్లిగూడూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో చెరువులు ఆక్రమణకు గురికావడంతో నీటి కోసం మూగ జీవాలు అవస్థలు పడుతున్నాయి. గతంలో గ్రామాలలో పాడి సంపద అధికంగా ఉండేది. రైతులు తమ పశు వులను, మూగజీవాలను మేతకు తీసుకు పోగా ఆయా చెరువులలో దాహార్తి తీర్చుకునేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. చెరువులను ఆక్రమించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేసుకుని ఆక్రమణదారులు దర్జాగా రొయ్యలు, చేపల సాగు చేసుకుంటున్నారు. ఈ చెరువుల ద్వారా గతంలో మత్స్యశాఖ, పంచాయతీలు వేలం పాటలు నిర్వ హించి వచ్చిన ఆదాయాన్ని గ్రామాభివృద్ధికి ఉపయోగించేవారు. చెరువుల్లో పుష్కలంగా నీరు ఉన్నట్లయితే సాగు, తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండేవికావు. కానీ ప్రస్తుతం చెరువుల్లో నీటిని నిలువ చేయక పోవడంతో వేసవిలో భూగర్భ జలాలు అడుగంటి తాగు, సాగునీటికి ఇబ్బందులు తలెత్తే అవకా శం ఉన్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఆయా రాజకీయ పార్టీలు తమ తమ అవసరాల కోసం చెరువుల ఆక్రమణలపై దృష్టి పెట్టకపోవడంతో ఆక్రమణదారులు యదేచ్ఛగా చెరువులను ఆక్రమించడం, కొందరు చెరువు భూములను అమ్ముకోవడం జరుగుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణలో ఉన్న చెరువులను కాపాడి పూర్వ వైభవం తీసుకురావాలని ఆయా గ్రామాల రైతులు, ప్రజలు కోరుతున్నారు.



చెత్తకుండీల జాడేది..?

తోటపల్లిగూడూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణకు చెత్తకుండీలను ప్రతి ఇంటికీ ఇవ్వాలని ప్రభుత్వం ప్రతి పంచాయతీకి సరఫరా చేసింది. కాగా, గ్రామ పాలకులు పట్టించుకోకపోవడంతో గ్రామాలు చెత్తమయంగా మారాయి. చెత్తకుండీలు లేకపోవడంతో గ్రామస్థులు చెత్తను రోడ్డు పక్క పోయడంతో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారినపడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పర్చాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రీన్ హౌస్‌లో వైద్య శిబిరం

కొడవలూరు, మే 23(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నార్తురాజుపాలెంలో ఉన్న గ్రీన్ హౌస్ రొయ్యల కర్మాగారంలో మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ హౌస్ ప్రతినిధులు హెచ్ఆర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఇలాంటి వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ శిబిరంలో ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



గ్రీన్‌హౌస్‌లో నిర్వహిస్తున్న వైద్యశిబిరం

కనుమరుగవుతున్న చేదుడు బావులు

- శిథిలావస్థలో బావులు
- పొంచిఉన్న ప్రమాదాలు



ఉదయగిరి పట్టణంలోని సుద్ధబావి వీధిలో శిథిలావస్థకు చేరిన గిలక బావి



చేదుడుబావిలో మొలచిన పిచ్చిమొక్కలు

ఉదయగిరి, మే 23 (ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాల క్రితం వరకు పల్లెల్లో ప్రజలకు తాగునీటి అవసరాల కోసం ఉపయోగపడిన చేదురు బావులు నేడు కనుమరుగవుతున్నాయి. నాడు పల్లెల్లో తెల్లవారుజామున వినిపించిన గిలకల శబ్దం మూగబోయింది. నీటి పరిరక్షణకు ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టకపోవడంతో కొన్నిచోట్ల అవి అన్యాక్రాంతమవుతున్నాయి. పలుచోట్ల జనవాసాల మధ్య ఉన్న మంచినీటి బావులు శిథిలావస్థకు చేరి ప్రమాదంగా మారడంతో స్థానికులు భీతిల్లుతున్నారు. మరికొన్నింటిని స్థానికులే కూల్చివేశారు. పూర్వీకుల నుంచి పల్లెల్లో మంచినీటి బావులు అనేకం ఉండేవి. రెండు దశాబ్దాల కిందట వరకు ఈ బావులే ఆయా ప్రాంతాల ప్రజల తాగునీటి అవసరాలకు ఆధారంగా ఉండేవి. అయితే కాలక్రమేణా వచ్చిన మార్పులతో పల్లెల్లో వీధివీధికి చేతిపంపులు దర్శనం ఇవ్వడంతో చేదురుబావులు నిర్లక్ష్యానికి గురయ్యాయి. అనంతరం ఓవర్‌హెడ్ ట్యాంకులు, వీధి కొళాయిలు, నీటి శుద్ధి కేంద్రాలు, ఇంటింటికీ క్యాన్ల ద్వారా నీటిని సరఫరా చేయడం ప్రారంభమైంది. దీంతో గ్రామాల్లోని మంచినీటి చేదురుబావులు నిరుపయోగంగా మారాయి. దీంతో ఈ బావులు ఆక్రమణలకు గురై కనుమరుగవుతున్నాయి.

శిథిలావస్థ బావులతో పొంచిఉన్న ప్రమాదం

దశాబ్దాల క్రితం నుంచి ఉన్న మంచినీటి బావులను నిరుపయోగంగా విడిచిపెట్టడంతో కొన్ని శిథిలావస్థకు చేరాయి. ఆవాసాల నడుమ ఉన్న ఈ బావుల సమీపంలో చిన్నారులు ఆటలాడుతుండడం వల్ల ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయపడుతున్నారు. పూర్తిగా శిథిలావస్థకు చేరిన బావులను పూడ్చి ఆయా స్థలాల పరిరక్షణకు తగిన చర్యలు చేపట్టడంతోపాటు ఆయా బావుల్లో ఎవరూ పడకుండా ఉండేందుకు గ్రిల్స్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

తెరుచుకోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లు

● వైద్యసేవలు అందక గ్రామస్థుల అవస్థలు

వింజమూరు, (ఆంధ్రజ్యోతి): మ ండలంలోని పలు గ్రా మాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు తెరుచుకోక వై ద్యసేవలు సక్రమంగా అందడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైసీ పీ ప్రభుత్వంలో ఏర్పాటుచేసిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదని, అరకొరగా వైద్యసేవలు అందుతున్నాయని వాపోతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, పలు కేంద్రాల్లో సిబ్బంది చుట్టపుచూపుగా వచ్చి వెళ్తున్నారని, కొన్నిచోట్ల కేంద్రాలు తెరుచుకోవడంలేదని విమర్శిస్తున్నారు. పలువురు అధికారులు కేంద్రాలకు వెళ్లకుండా పీహెచ్‌సీల్లోనే ఉంటున్నారని, దీంతో చిన్న రోగానికి కూడా దూరప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విలేజ్ హెల్త్ క్లినిక్‌లను అందుబాటులోకి తీసుకొచ్చి వైద్యసేవలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

C.R.I.M.E N.E.W.S



కోవూరు పోలీసులు స్వాధీనం చేసుకున్న గోవులు

అక్రమంగా తరలిస్తున్న గోవుల స్వాధీనం

కోవూరు, మే 23(ఆంధ్రజ్యోతి): గోవధకు అక్రమంగా తరలిస్తున్న 45 గోవులను కోవూరు పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. తిరపతి జిల్లా చిల్లకూరు మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి కొనుగోలు చేసి గోవధకు దూరప్రాంతానికి తరలించేందుకు సిద్ధం చేశారు. వీటన్నింటిని కోవూరు మండల పరిధిలోని జాతీయ రహదారి పక్కన భారత్ గ్యాస్ గోదాము వెనుక భాగంలోని ప్లాట్లలో ఉంచి రవాణా చేసే వాహనం కోసం ఎదురు చూస్తుండగా ఈ సమాచారం పోలీసులకు అందింది. దీంతో సీఐ సుధాకరరెడ్డి, ఎస్ఐ రంగనాథ్‌గౌడ్, పోలీసు సిబ్బందితో కలసి హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకున్నారు. దీంతో ఆ గోవులకు సంబంధించిన వ్యక్తులు అక్కడి నుంచి పరారయ్యారు. పోలీసులు గోవులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎక్సైజ్ అధికారుల రాత్రి గస్తీ

● మద్యం దుకాణాలు, బార్ల వేళలపై నిఘా

నెల్లూరు(క్రైం), మే 22 (ఆంధ్రజ్యోతి) : ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారులు, స్టేట్ టాస్క్‌ఫోర్స్ విజయవాడ బృందంతో కలిసి గురువారం రాత్రి నెల్లూరులో గస్తీ నిర్వహించారు. మద్యం షాపులు, బార్ల సమయపాలన కచ్చితంగా పాటిస్తున్నారా?, అనధికారికంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయా? అని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ జిల్లా డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాత్రి గస్తీ నిర్వహించామని చెప్పారు. మద్యం షాపులు, బార్లు నిర్దేశిత వేళలు తప్పని సరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ దయాసాగర్, స్టేట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్ మధు, అదనపు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ జగదీష్, ఇన్‌స్పెక్టర్లు బాలనర్సింహ, వై వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వివాహితకు లైంగిక వేధింపులు

నెల్లూరు(క్రైం), మే 23 (ఆంధ్రజ్యోతి) : 'నాతో నీవు తీసుకున్న ఫొటోలు ఉన్నాయి.... నా కోర్కె తీర్చకుంటే వాటిని అందరికీ చూపించి నిన్ను అల్లరి చేస్తా'నంటూ వివాహితను ఓ వ్యక్తి లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడు. అతని వేధింపులు తాళలేని బాధితురాలు తన భర్త సహకారంతో పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని కరెంటాఫీసు సెంటర్ సమీపంలో ఓ కుటుంబం నివసిస్తోంది. భార్య, భర్త ఇద్దరు పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వివాహిత తన సమీప బంధువు వెంకటేశ్వర్లుతో కుటుంబ విషయాలను చెప్పుకుంటూ సన్నిహితంగా ఉండేది. అతని ప్రవర్తనలో మార్పు రావడాన్ని గమనించిన వివాహిత అతన్ని దూరం పెట్టడం ప్రారంభించింది. దీంతో కోపోద్రిక్తుడైన వెంకటేశ్వర్లు తన కోర్కె తీర్చాలంటూ వివాహితను వేధించసాగాడు. ఈ విషయాన్ని భర్తతో చెప్పడంతో అతను వెంకటేశ్వర్లును మందలించాడు. అయినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. వివాహితతో తీసుకున్న ఫొటోలను బంధువులకు పంపించాడు. దీంతో బాధితురాలు భర్తతో కలిసి గురువారం రాత్రి వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆరోగ్య సమస్యలతో ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), మే 23 (ఆంధ్రజ్యోతి) : ఒంటరితనం, ఆరోగ్య సమస్యలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల సమాచారం మేరకు... కృష్ణ జిల్లా గుడివాడకు చెందిన నరేష్‌కుమార్ (40), రఫియాబేగం ఏడేళ్లకిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి ఆరేళ్ల కుమారుడున్నాడు. నరేష్ కుమార్ పలు వ్యాపారాలు చేస్తూ మద్యానికి బానిసయ్యాడు. అనారోగ్యానికి గురికావడంతో గుండె ఆపరేషన్ చేయించుకున్నాడు. అయినా అతను మద్యం మానకపోవంతో సంవత్సరం క్రితం భార్య అతనిని వదిలి పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి నరేష్‌ను తల్లి రమాసుందరి చూసుకుంటోంది. వారిద్దరు ఆరు నెలల క్రితం నెల్లూరులోని జనార్ధన్‌రెడ్డి కాలనీలో ఉంటున్న రమాసుందరి సోదరి పద్మావతి ఇంటికి వచ్చారు. స్థానికంగా ఓ ఇల్లు అద్దెకు తీసుకుని జీవిస్తున్నారు. ఒంటరితనం, అనారోగ్యంతో నరేష్‌కుమార్ బాధపడుతూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో గురువారం ఇంట్లో తల్లి లేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాత్రి ఇంటికి వచ్చిన తల్లి కుమారుడిని చూసి కన్నీరుమున్నీరైంది. శుక్రవారం తెల్లవారుజామున నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ రెహమాన్ మృతదేహాన్ని పరిశీలించి జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గోకులం షెడ్ల బిల్లుల కోసం లబ్ధిదారుల ఎదురుచూపు

మర్రిపాడు, మే 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద గోకులం షెడ్లు నిర్మించుకున్న రైతులు బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. నెలలు గడుస్తున్నా బిల్లులు రాకపోవటంతో వడ్డీలు కట్టడానికి అవస్థలు పడుతున్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని 6 మండలాల్లో 258 షెడ్లు మంజూరయ్యాయి. 6 పశువులు గల షెడ్డుకు రూ. 2.30లక్షలు, 4 గేదెల షెడ్డుకు రూ. 1.85లక్షలు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోంది. ఈ పథకం మొత్తం విలువలో 10శాతం లబ్ధిదారుడు చెల్లిస్తే మిగిలిన మొత్తం రాయితీ వర్తించనుంది. కాగా, మర్రిపాడు మండలంలో 54 గోకులం షెడ్లు మంజూరు కాగా 41 పూర్తయ్యాయి. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. కాగా, బిల్లుల మంజూరుకు ఎదురుచూడాల్సి వస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు. అప్పులు చేసి నిర్మాణాలు చేపట్టామని.. వడ్డీ పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

త్వరలో లబ్ధిదారుల ఖాతాలకు నగదు జమ : ఏపీవో

త్వరలో లబ్ధిదారుల ఖాతాలకు నగదు జమ అవుతాయని ఏపీవో నారాయణ తెలిపారు. గోకులం షెడ్లకు సంబంధించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. నిధులు విడుదల కాగానే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఆపరేషన్ కగార్ పేరుతో హత్యాకాండ

● సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి పోలయ్య

సైదాపురం, మే 23 (ఆంధ్రజ్యోతి): గత సంవత్సర కాలంగా మధ్య భారత అడవుల్లో భారత ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో హత్యా కాండను కొనసాగిస్తోందని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డీపీ పోలయ్య ఖండించారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ సీపీఐ మావోయిస్టు పార్టీ కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజ్‌తో సహా 27 మందిని బూటపు ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చి చంపడాన్ని ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	133
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	264
కోడిగుడ్ల ధర (100):	530



ముగిసిన హనుమజ్జయంతి ఉత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), మే 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఎన్టీఆర్ నగర్‌లో జరుగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. చివరి రోజు ఉదయం అభయాంజనేయ స్వామికి అభిషేకాలు, విశేష పూజలు, అనంతరం నగరోత్సవం నిర్వహించారు. కమిటీ సభ్యులు శివారెడ్డి, గాలి శ్రీధర్, నర్సారెడ్డి, రాజీవ్, సుబ్బరాయుడు, మురళీ, విశ్వనాథం, రమణారెడ్డి, తదితరులు పర్యవేక్షించారు. ఇస్కాన్‌సిటీ హనుమాన్ జంక్షన్‌లో చిన్నారులు చేసిన హనుమాన్ భజనలు ఆకట్టుకున్నాయి. బాలలకు గోవిందరాజు సీతాదేవి సాహితీ ఫౌండేషన్ తరపున గోవిందరాజు సుభద్రాదేవి జ్ఞాపికలు అందజేశారు.

ఐటీఐ కళాశాలలో
నేడు జాబ్‌మేళా

నెల్లూరు(విద్య), మే 23 (ఆంధ్రజ్యోతి) : ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఆఫీసు, సీడాప్ సంయుక్తంగా శనివారం వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కే శ్రీధర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ చదివిన వారు మేళాలో పాల్గొనవచ్చన్నారు. ఎంపికైన వారికి జిల్లాలోని ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తారని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు ప్రదోషకాల పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), మే 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రదోషకాల పూజలు జరుగుతాయని ఆలయ ఈవో అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4గంటలకు నందీశ్వరునికి, మూలస్థానేశ్వర స్వామికి అభిషేకాలు, అలంకారం జరుగుతాయని పేర్కొన్నారు. రాత్రి వెండి చిన్న నందివాహనంపై ప్రాకారోత్సవం జరుగుతుందని, భక్తులు అందరూ తరలిరావాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(జడ్పీ), మే 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని రామూర్తినగర్, కోటమిట్ట సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎం శ్రీధర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రామూర్తి నగర్, జేమ్స్ గార్డెన్, రామలింగాపురం, బాలాజీనగర్, ఏసీ నగర్, పూలే బొమ్మ, జెండావీధి, కోటమిట్ట, గిడ్డంగివీధి, వీబీఎస్ కల్యాణ మండపం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. .

రేపు బయ్యా రమణయ్య జయంతి

నెల్లూరు (సాంస్కృతికం), మే 23 (ఆంధ్రజ్యోతి) : కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం టౌనుహాలులో శుభమస్తు షాపింగ్ మాల్ అధినేత బయ్యా వెంకట రమణయ్య 80వ జయంతి నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపకుడు కేతా సుబ్బారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాటలు, డ్యాన్స్ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమంలో 100 మంది చిన్నారులతో నృత్య విభావరి జరుగుతుందని, కళాభిమానులు హాజరుకావాలని కోరారు.

బదిలీల్లో సాంకేతిక సమస్యలు

నెల్లూరు(విద్య), మే 23 (ఆంధ్రజ్యోతి) : బదిలీల్లో సాంకేతిక సమస్యల కారణంగా ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు మోహన్ దాస్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత నాలుగు నెలలుగా రాష్ట్ర విద్యాశాఖ అధికారులతో ఉపాధ్యాయ సంఘాలు అనేక దఫాలు చర్చించినా సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ప్రస్తుతం బదిలీల ప్రక్రియలో సాంకేతిక సమస్యలతో రోజుకో ఇబ్బంది ఎదురవుతోందని తెలిపారు. డీఈవో కార్యాలయంలోని హెల్ప్‌లైన్ నెంబర్లు కూడా పనిచేయడం లేదని ఆరోపించారు. అధికారులు వెంటనే చర్యలు చేపట్ట కుంటే బదిలీలు మరింత గందరగోళంగా మారడంతోపాటు నిలిచిపోయే ప్రమాదముందని తెలిపారు.

ప్రతిభా పురస్కారాలకు
దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), మే 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని నాయీ బ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అందించేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నాయీ బ్రాహ్మణ ఎంప్లాయీస్ సొసైటీ అధ్యక్షుడు వేలూరు రంగారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు టెన్త్, ఇంటర్‌లో పొందిన మార్కుల ఆధారంగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపిక చేసిన వారికి జూన్ 22న పురస్కారాలను అందచేస్తామని తెలిపారు.

సైనిక స్కూల్
ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ

నెల్లూరు(విద్య), మే 23 (ఆంధ్రజ్యోతి) : సైనిక స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశం కోసం జరిగిన పరీక్షల్లో నగరంలోని గురుస్థాన్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని ఆ సెంటర్ కరస్పాండెంట్ షేక్ మహ్మద్ ఖాన్ తెలిపారు. శుక్రవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ వద్ద శిక్షణ పొందిన సాంద్ర తారక్ 300 మార్కులకు 286 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచాడన్నారు. 11 మంది విద్యార్థులు 200కుపైగా మార్కులు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షేక్ బీబాజాన్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు వైద్యశిబిరం


నెల్లూరు (వైద్యం), మే 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని చెన్నై ఇన్ఫర్మేషన్ ఆసుపత్రిలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి చైర్మన్ ఎస్వీ రమేష్‌బాబు తెలిపారు. శుక్రవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చెన్నై ఇన్ఫర్మేషన్ సెంటర్ స్థాపించి 13 ఏళ్ల పూర్తయిన సందర్భంగా పాలిక్లినిక్‌ను ప్రారంభిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, రాజేశ్వరి, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ

నెల్లూరు(విద్య), మే 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శుక్రవారం వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. దాతలు కే గోపాల్‌రెడ్డి, ఖలీల్‌బేగ్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, కోశాధికారి జీకే గోపీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఆ.. ఆర్ఐ గట్టోడు!

- బదిలీ చేసిన ఒక్కరోజులోనే అదే స్థానానికి పోస్టింగ్
- విస్మయం వ్యక్తం చేస్తున్న కార్పొరేషన్ యంత్రాంగం



నెల్లూరు(సిటీ), మే 23 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర పాలక సంస్థలోని రెవెన్యూ విభాగంలో ఓ యువ ఆర్ఐ చక్రం తిప్పుతున్నాడు. తన పనితీరును తప్పుపట్టి బదిలీ చేసిన ఉన్నతాధికారులను సైతం బుట్టలో వేసుకుని తాను కోరుకున్న పోస్టింగ్‌ను ఒక్క రోజులోనే తెచ్చుకోవడం కార్పొరేషన్ యంత్రాంగాన్ని విస్మయానికి గురిచేస్తోంది. నగర పాలక సంస్థలో ఆర్ఐగా పని చేస్తున్న అతని పనితీరు బాగా లేదంటూ ఇటీవల కమిషనర్ నందన్ షోకాజు నోటీసులు జారీ చేశారు. పలు భవనాల నుంచి పన్ను వసూలు చేయలేదని, రీ సర్వేలోనూ పన్ను సవరణలు జరపలేదని, అందుకు గల కారణాలు తెలియచేయాలని ఆదేశిస్తూ లిఖిత పూర్వక వివరణ కోరారు. గత మంగళవారం అతనిని ఆర్ఐ బాధ్యతల నుంచి తప్పించి హెచ్1 సెక్షన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. ఏమైందో ఏమో గానీ కమిషనర్ ఆ ఆ ఉత్తర్వులను గురువారం రద్దు చేసి సదరు ఉద్యోగికి మళ్లీ ఆర్ఐగా పోస్టింగ్ ఇచ్చి పలు డివిజన్లు కేటాయించారు. ఈ ఉత్తర్వులు బయటకు రావడంతో కార్యాలయ వర్గాలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. బదిలీ చేసిన వ్యక్తికి ఒక్క రోజులో మళ్లీ అదే పోస్టింగ్ ఎలా ఇచ్చారని చర్చించుకుంటున్నారు. అటూ అధికార పార్టీ నాయకులు, ఇటు అధికారుల్లోనూ ఈ పరిణామంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వీఆర్ హైస్కూల్‌కు పూర్వవైభవం

- ఎంపీ వేమిరెడ్డి



వీఆర్ హైస్కూల్‌ను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు(విద్య), మే 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వీఆర్ హైస్కూల్‌ను ఆధునీకరించి పూర్వవైభవంతో విద్యార్థులకు అందించేందుకు మంత్రి నారాయణ విశేష కృషి చేస్తున్నారని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆ స్కూల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణతో కలిసి ఎంపీ శుక్రవారం పరిశీలించారు. 2వేల మంది పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను ఉచితంగా అందించాలన్న లక్ష్యంతో చేపడుతున్న ఈ యజ్ఞంలో మంత్రి కుమార్తె శరణి భాగస్వామి కావడం అభినందనీయమన్నారు. అనంతరం అభివృద్ధి పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ

నెల్లూరు (హరనాథపురం), మే 23 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆదివారం నగరంలోని ఆయన నివాసంలో నలుగురు దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేశారు. నడవలేక అవస్థ పడే ప్రతీ ఒక్క దివ్యాంగుడికి ట్రై సైకిళ్లు అందజేయడం వీపీఆర్ ఫౌండేషన్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఏపీ ఆగ్రో ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

నెల్లూరు (హరనాథపురం), మే 23 (ఆంధ్రజ్యోతి) : కోవూరు నియోజకవర్గానికి చెందిన 17 మందికి రూ.19.50 లక్షల విలువ గల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. నెల్లూరులో ఎమ్మెల్యే నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఇప్పటివరకు 170 మంది అనారోగ్య బాధితులను ఆదుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఇందుకూరుపేట, కొడవలూరు, విడవలూరు, బుచ్చి మండల అధ్యక్షులు ఏకొల్లు పవన్ కుమార్ రెడ్డి, నాపా వెంకటేశ్వర్లు నాయుడు, శ్రీహరిరెడ్డి, బెజవాడ జగదీష్, నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సంబరాలు



రెండవ డిపో గ్యారేజ్ గేటు వద్ద ఎన్‌ఎంయూఏ నాయకుల సంబరాలు

నెల్లూరు(క్రైం), మే 23 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ యాజమాన్యంతో ఎన్‌ఎంయుఏ నాయకులు జరిపిన చర్చలు సఫలం కావడంతో శుక్రవారం నగరంలోని ఆర్టీసీ 1,2 డిపోల గ్యారేజ్ గేట్ల ఎదుట ఎన్‌ఎంయుఏ నాయకులు, కార్మికులు సంబరాలు చేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి మురళీమోహన్‌రెడ్డి మాట్లాడుతూ రెండు నెలలుగా కార్మికుల సమస్యలపై యూనియన్ అలుపెరుగని పోరాటం చేసిందన్నారు. యాజమాన్యంతో జరిపిన చర్చల ఫలితంగా 1-19 సర్క్యులర్ అమలుకి ఆదేశాలు జారీ చేసిందన్నారు. యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

సమీక్షకు రాని వారి జీతాలు ఆపేయండి

- సిటీప్లానింగ్ అధికారులతో కమిషనర్ నందన్



నెల్లూరు(సిటీ), మే 23 (ఆంధ్రజ్యోతి) : వారాంతపు సమీక్షకు హాజరుకాని సిటీ ప్లానింగ్ సెక్రటరీలకు జీతాలు ఆపేయండని కమిషనర్ నందన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన సిటీప్లానింగ్ సమీక్షకు 126 మందికిగాను 68 మందే హాజరయ్యారు. వీరంతా పెండింగ్ ఫైల్స్ ఉన్నవారే కావడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల సమీక్షకు హాజరుకాకపోతే ఎలా..? అని ప్రశ్నించారు. గైర్హాజరైన వారందరి జీతాలు ఆపేయాలని సూచించారు. ప్లానింగ్ సెక్రటరీల లాగిన్‌లో ఉన్న దరఖాస్తులను 24 గంటల్లో పరిష్కరించాలని ఆదేశించారు. భవనాలకు అనుమతులు ఇచ్చేటప్పుడే అనధికార లేఅవుట్లను గుర్తించాలని, ప్రకటన బోర్డులు ఏర్పాటు చేసిన వారి నుంచి పన్నులు వసూలు చేయాలని సూచించారు. అనధికారికంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, పోస్టర్లను తొలగించాలన్నారు. అంతకుముందు 18,19, 20 డివిజన్లలో పారిశుధ్య పనులను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

అర్హులందరికీ పరిహారం : ఆర్డీవో అనూష



గ్రామ సభలో మాట్లాడుతున్న ఆర్డీవో అనూష

నెల్లూరురూరల్, మే 23,(ఆంధ్రజ్యోతి) : ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటుకు భూములిచ్చిన లబ్ధిదారులందరికీ అర్హత మేరకు పరిహారం అందజేస్తామని నెల్లూరు ఆర్డీవో అనూష తెలిపారు. శుక్రవారం మండలంలోని అమంచర్ల గ్రామంలో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలో 75 ఎకరాలను ఏపీఐఐసీకి కేటాయించినట్లు తెలిపారు. పారిశ్రామిక అభివృద్ధి నేపథ్యంలో రైతుల నుంచి తీసుకున్న భూములకు తగు పరిహారం ఇప్పటికే అందచేశామని చెప్పారు. మిగిలిన వారికి కూడా పరిహారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

వివాదాస్పద భూమిని పరిశీలించిన ఆర్డీవో

ఉదయగిరి, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నేపల్లి రెవెన్యూ జెట్టివారిపల్లి గ్రామంలో 41/2లో 4.14 ఎకరాల వివాదాస్పద భూమిని జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆత్మకూరు ఆర్డీవో పావని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె భూమికి సంబంధించిన అన్ని రికార్డులను పరిశీలించారు. అలాగే వివాదం నెలకొన్న ఇరువర్గాలతో మాట్లాడడంతోపాటు గ్రామస్తులను విచారించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సుభద్ర, రీసర్వే డిప్యూటీ తహసీల్దారు జహీర్, వీఆర్వో అంజాద్, సర్వేయరు రవీంద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

కావలిరూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): కావలి మండలం మన్నంగిదిన్నె పంచాయతీ మోర్లవారిపాలెం సమీపంలోని పొలాల్లో కోడి పందేల స్థావరంపై శుక్రవారం పోలీసులు దాడులు చేశారు. రూరల్ సీఐ రాజేశ్వరరావుకు అందిన సమాచారం మేరకు ఎస్ఐ బాలకృష్ణయ్య తన సిబ్బందితో కలిసి నిర్వహించిన ఈ దాడుల్లో కోడి పందేలు ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 1 కోడిపుంజు, రూ.1580 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'వాత్సల్య' విద్యార్థినికి
బీటెక్‌లో డిస్టింక్షన్



నెల్లూరు (హరనాథపురం), మే 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వాత్సల్య అనాథ శరణాలయంలో పెరిగిన నిషిక రాజ్ అనే విద్యార్థిని బీటెక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణురాలైంది. దాత, ప్రముఖ కంటి వైద్యుడు డాక్టర్ ఓ గోపాలకృష్ణ అందించిన ఆర్థిక సహాయంతో ఆ విద్యార్థిని చిత్తూరులోని శ్రీవెంకటేశ్వర కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో బీటెక్ పూర్తి చేసింది. డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణత సాధించిన నిషికను, వాత్సల్య సంస్థ ఆర్గనైజింగ్ కార్యదర్శి జీవీ సాంబ శివరావు అభినందించారు. నిషిక మాట్లాడుతూ గ్రూప్స్ పరీక్షలు రాసి మంచి ఉద్యోగం సాధిస్తానని చెప్పారు.

అత్యాధునిక పద్ధతుల్లో
నేటి నుంచి చెస్ శిక్షణ

నెల్లూరు(విద్య), మే 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని బాల, బాలికలకు అత్యాధునిక పద్ధతుల్లో చెస్ శిక్షణ అందించడంతోపాటు వారికి పోటీలు నిర్వహించేలా సన్నాహాలు చేస్తున్నామని రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై సుమన్ తెలిపారు. నగరంలోని ఎంజీబీ ఫెలిసిటీ మాల్‌లో శుక్రవారం శిక్షణ, పోటీలకు సంబంధించిన గోడపత్రికలను ఆయన ఆవిష్కరించారు. రాష్ట్ర చెస్ అసోసియేషన్, శ్రీ ఆనంద్ వింగ్స్ చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఎంజీబీ ఫెలిసిటీ మాల్‌లో శనివారం నుంచి జూన్ 2 వరకు ప్రతి రోజూ సాయంత్రం 6 నుంచి 8.30 గంటల వరకు 6 నుంచి 16 ఏళ్లలోపు పిల్లలకు శిక్షణ, పోటీలుంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాల్ మేనేజర్ రాజశేఖర్, హెచ్‌ఆర్ అమూల్య, మార్కెటింగ్ అసిస్టెంట్ మేనేజర్ జగదీష్, శ్రీ ఆనంద్ వింగ్స్ చెస్ అకాడమీ కోచ్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, ఆర్బిటర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వ్యతిరేకులకూ
పని చేసిపెడతా..!

- రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కోటంరెడ్డి


నెల్లూరు రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి) : తాను ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు చేస్తానని, తనకు ఓటు వెయ్యని వారు, తనకు వ్యతిరేకంగా పనిచేసిన వారైనా సరే సమస్యలతో తన దగ్గరకు వస్తే వారికి కూడా పనిచేసి పెడతానని రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో వైసీపీకి చెందిన 32వ డివిజన్ నాయకుడు గౌస్‌బాషాతోపాటు ఆయన మిత్రబృందాన్ని కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. పార్టీలు, కుల,మతాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేస్తున్నామని చెప్పారు.

మోత మోగిస్తున్నారు

రోడ్డుపై వెళుతున్న సమయంలో దుష్యూ.... దుష్యూ.... అంటూ తుపాకీ పేల్చిన శబ్దాలు. టుప్ టుప్... అంటూ పెద్ద బాణాసంచా పేలిన శబ్దాలు.... విచిత్రమైన అడవి జంతువుల అరుపులాంటి శబ్దాలు... ఇలా వాహనాలకు అమర్చిన వివిధ రకాల హారన్లు ఇటీవల కాలంలో ఎక్కువగా వినిపిస్తున్నాయి. దీంతో రోడ్డుపైన వెళుతున్న వాహనదారులు, ప్రయాణికులు, ఒక్కసారిగా ఉలిక్కి పడుతున్నారు. ఏమైందన్ని భయంగా పక్కకు తిరిగితే భారీ శబ్దంతో అతివేగంతో యువత ద్విచక్ర వాహనాలపై దూసుకుపోతూ ఉంటుంది. కళాశాలకు వెళ్లే విద్యార్థులు, యువత, మైనర్లు అధిక శబ్దాలు వస్తున్న వాహనాలను వినియోగిస్తున్నారు. ఎవరైనా ప్రజలు ప్రశ్నిస్తే గొడవకు దిగుతున్నారు. సైలెన్సర్ల మోతతో ప్రస్తుతం ప్రజలు అసహనానికి, అనారోగ్యానికి గురవుతున్నారు. నెల్లూరు నగరంలో ఇటీవల కాలంలో అధిక శబ్దకాలుష్యం చేస్తున్న వాహనాల సంఖ్య భారీ సంఖ్యలో పెరిగిపోయింది. పోలీసులు సైతం వీటిని పట్టించుకోక పోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.

- బైక్‌ల సైలెన్సర్ల నుంచి భారీ శబ్దాలు
- భయంతో హడలిపోతున్న ప్రజలు
- అధిక శబ్ద కాలుష్యంతో అనారోగ్యాలు
- పట్టించుకోని రవాణా, పోలీసు అధికారులు

నెల్లూరు(క్రైం), మే 23 (ఆంధ్రజ్యోతి) : ప్రతి మోటారు వాహనం కంపెనీ తమ బైక్‌కు నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత డెసిబుల్ శబ్దాన్ని వెలువరించే నిర్దిష్ట ప్రమాణాలతో సైలెన్సర్‌ను తీర్చిదిద్దుతుంది. అలాంటి డిజైన్లకే రవాణా శాఖ అనుమతులు ఇస్తుంది. మనిషి సాధారణంగా 60 డెసిబుల్స్ వరకు శబ్దం వినగలడు. అంతకు మించిన శబ్దం వింటే కర్ణభేరిపై ప్రభావం చూపుతుంది. అయితే సరికొత్త సైలెన్సర్ల నుంచి వచ్చే శబ్దాలకు ఎక్కువ మంది యువత ఆకర్షితులవుతున్నారు. బైక్‌లతో రోడ్డెక్కి భారీ శబ్దాలు చేస్తూ చుట్టుపక్కల వాహనదారులు, ప్రజల గుండెల్లో అలజడి



రేపుతున్నారు.

నగరంలో భారీ శబ్దాలు చేస్తున్న బైక్‌ల సంఖ్య పెరుగుతున్నా అటు రవాణా, ఇటు పోలీసు శాఖలు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

భారీ శబ్దాలు వచ్చే సైలెన్సర్లు అమర్చుతూ

షోరూముల్లో కొనుగోలు చేసిన బైక్‌లకు యువత సైలెన్సర్లను మార్చి భారీ శబ్దాలను వెలువరించే పరికరాలను అమర్చుతున్నారు. కాలం చెల్లిన పాత బైక్‌లను సైతం అధిక శబ్దాలు వచ్చే సైలెన్సర్లను అమర్చుకొని రోడ్డుపై తిప్పుతున్నారు. ప్రస్తుతం యువత వినియోగిస్తున్న వాహనాల్లో 90 శాతం వాహనాలు పర్యావరణానికి, ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఉన్నాయి. వీటి సైలెన్సర్లలో కొద్దిపాటి మార్పు చేస్తే అవి వెలువరించే శబ్దం ప్రత్యేకంగా ఉంటుంది. ఎదుటి వారికి అసౌకర్యం కలిగించేలా శబ్దాలు ఉంటాయి. కుర్రాళ్లు ఇలాంటి శబ్దాలు వచ్చే సైలెన్సర్లతో కూడిన వాహనాలు నడుపుతున్నారు.

రూ.5 వేల నుంచి ప్రారంభం

రోడ్లపై తిరుగుతున్న వాహనాలు భారీ శబ్దాలు చేసుకుంటూ వెళుతుండటం చూసి రోజూ తిట్టుకుంటూనే ఉంటున్నాము. పలు రకాల హారన్లతోపాటు ప్రస్తుతం సైలెన్సర్ల నుంచి అధిక శబ్దాలు వస్తున్నాయి. వైల్డ్‌బోర్, కాక్‌టైల్ షార్మర్, డాల్ఫిన్, మెగాఫోన్, డెవిల్, క్రాకర్ ఇలా అనేక పేర్లతో మార్కెట్‌లో సైలెన్సర్లు దొరుకుతున్నాయి. బైక్‌లకు వీటిని అమర్చుకుంటే భారీ శబ్దాన్నిస్తాయి. వీటి ధరలు రూ.5 వేల నుంచి రూ.50 వేలకుపైగా ఉన్నాయి.

శబ్ద కాలుష్యంపై కేసులు

శబ్ద కాలుష్య కారక వాహనాలు నడిపేవారిపై ఎంవీఐ యాక్ట్ 1988 సెక్షన్ 190(2) ప్రకారం పోలీసులు, రవాణాశాఖ అధికారులు కేసు నమోదు చేస్తారు. తొలిసారి అయితే కేసు నమోదుతోపాటు రూ.1000 జరిమానా, రెండోసారి పట్టుబడితే రూ.2వేలు జరిమానాతోపాటు కఠిన చర్యలకు సిఫారసు చేస్తారు. మోటారు కంపెనీ ఉత్పత్తి చేసిన బైకులకు విడి పరికరాలు మార్చడం చట్టరీత్యా నేరమన్న విషయాన్ని వాహనదారులు గుర్తుంచుకోవాలి.

అధిక శబ్దాలతో ఆరోగ్య సమస్యలు

- 60 డెసిబుల్స్‌లోపు శబ్దం వింటే ఎటువంటి ఇబ్బందులు ఉండవు.
- 100 డెసిబుల్స్ శబ్దం దాటితే గుండెజబ్బులు ఉన్నవారిపై తీవ్ర ప్రభావం చూపుతుంది.
- 110 డెసిబుల్స్ శబ్దం దాటితే ప్రజలకు చికాకుతోపాటు విపరీతమైన కోపం, తలనొప్పి వస్తుంది.
- 120 డెసిబుల్స్ శబ్దం దాటితే చిరాకు, చర్మంపై రోమాలు నిక్కపొడుచుకోవడం, విపరీతమైన తలనొప్పి వస్తాయి.
- 160 డెసిబుల్స్ శబ్దం దాటితే చెవుల్లో వినికిడి కణాలపై ప్రభావం చూపుతాయి. నరాలు దెబ్బతిని పాక్షిక వైకల్యం కలుగుతుంది.
- 190 డెసిబుల్స్ శబ్దం దాటితే కర్ణభేరి పగిలిపోతుంది. దాని ద్వారా శాశ్వతంగా వినికిడి శక్తి కోల్పోతారని వైద్యులు చెబుతున్నారు.


టీడీపీ జెండాను ఆవిష్కరిస్తూ..

పసుపు పండుగ!

అట్టహాసంగా నెల్లూరు పార్లమెంట్ టీడీపీ మహానాడు


మహానాడు వేదికపై నృత్యం చేస్తున్న యువతులు

జిల్లావ్యాప్తంగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో నెల్లూరు పార్లమెంట్ టీడీపీ మహానాడు విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకుల్లో అత్యధిక శాతం మంది పసుపు వస్త్రాలు ధరించి రావడంతో సభా ప్రాంగణం పసుపుమయం అయ్యింది. ఇక ప్రజాప్రతినిదులు, నాయకులు, కార్యకర్తలు ఒకరినొకరు అలింగనం చేసుకుంటూ సరదాగా మాట్లాడుకున్నారు.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)



ఎంపీ వేమిరెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి, మధ్యలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

మంత్రి నారాయణతో మాట్లాడుతున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి


మంత్రులు ఆనం, నారాయణ ముచ్చట్లు


ఎమ్మెల్యేలు కాకార్ల సురేష్, కావ్య కృష్ణారెడ్డి, నాగేశ్వరరావుల మాటామంతీ



కాఫీ, టీ, బిస్కెట్...

భారీగా పెరిగిన నగదు రహిత చెల్లింపులు

అన్నీ ఆన్‌లైనే!

ఒకప్పుడు జేబునిండా డబ్బులుంటే మురిసిపోయే వారు. ఇప్పుడు చొక్కా జేబులో చిల్లిగవ్వ లేకపోయినా, క్రెడిట్, డెబిట్ కార్డులు లేకపోయినా స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు ఎన్ని లక్షల లావాదేవీలైనా చేసేయొచ్చు. సామాన్యుల నుంచి కోటీశ్వరుల వరకు అందరూ అనుసరిస్తున్న విధానం ఒక్కటే... అదే ఆన్‌లైన్ పేమెంట్. రోడ్డు పక్కన బండిపై టీ తాగే దగ్గర్నుంచి షోరూమ్‌లో బంగారం కొనేవరకు అన్నింటికీ ఆన్‌లైన్ చెల్లింపులే!. పెద్దనోట్ల రద్దు, కొవిడ్ తదితనంతర పరిణామాలతో క్యాష్‌లెస్ పేమెంట్స్ విపరీతంగా పెరిగాయి. దీనికితోడు సాంకేతిక విప్లవంతో స్మార్ట్‌ఫోన్ వాడకం పెరగడం, పలు రకాల యాప్‌లు అందుబాటులోకి రావడంతో ఆన్‌లైన్ చెల్లింపులు ఊపందుకున్నాయి.



- స్మార్ట్ ఫోన్‌తోనే లావాదేవీలు
- యూపీఐ, నెట్ బ్యాంకింగ్‌తో కొనుగోళ్లు
- పెద్ద నోట్ల రద్దు... కొవిడ్ ప్రభావం...
- సాంకేతిక విప్లవంతో తగ్గిన నగదు చెలామణి

నెల్లూరు (హరనాథపురం), మే 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆన్‌లైన్ లావాదేవీలు బాగా పెరిగిపోయాయి. 2016 నవంబరు 8న ప్రధాని మోదీ పెద్దనోట్ల రద్దును ప్రకటించాక కొద్ది రోజులు సామా న్యులు నగదుకు తీవ్ర ఇబ్బందులు పడిన ప్పటికీ ఆ తర్వాత ఆన్‌లైన్ చెల్లింపులు జోరందుకున్నాయి. నల్లడబబ్బును వెలికి తీయం, ఉగ్రవాదానికి ఊతమిస్తున్న నకిలీ కరెన్సీని అదుపు చేయడం, స్విస్ బ్యాంకులో మూలుగుతున్న రూ.లక్షల కోట్లను వెనక్కు రప్పించడం, అదే సమ యంలో నగదు రహిత లావాదేవీ లను పెంచడం లక్ష్యంగా ప్రధాని తీసుకున్న నిర్ణయం మంచి ఫలితాలను ఇచ్చింది. దీనికితోడు కొవిడ్ మహమ్మారి విజృంభిం చిన సమయంలో ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితుల్లో ఎక్కువ మంది ఆన్‌లైన్ కొనుగోళ్లకు అలవాటుపడ్డారు. ఇంటికి కావలసిన చిల్లర సామాన్లు మొదలు, రోజువారీ అవసరమైన కూరగాయలు, భోజనం వరకు అన్నింటినీ ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవడం పెరిగింది. నేరుగా వెళ్లాల్సిన అవసరం లేకపోవడం, ఇంటి వద్దకే కావలసినవి వస్తుండటంతో ఈ విధానాన్ని కొనసాగిస్తున్నారు.

నగదును దాచేస్తున్నారు...

ఒకవైపు ఆన్‌లైన్ చెల్లింపులు భారీగా పెరుగుతుండగా మరోవైపు ప్రజలు నగదును దాచేస్తున్నట్లు నిపుణులు విశ్లేషిస్తున్నారు. వ్యక్తిగతంగా ఒకరి వద్దగానీ, ఒక కుటుం బంలోగానీ రూ.2లక్షలకు మించి నగదు ఉండకూడద నేది కేంద్ర ప్రభుత్వ నిబం ధన. అయినప్పటికీ అవకాశం ఉన్నంత మేరకు లిక్విడ్ క్యాష్‌ను భద్రపరు చుకుంటు న్నారు. కొందరైతే అనధికారిక సంపాద నంతా నగదు రూపంలో తీసుకుంటూ కోట్ల రూపాయలు దాచేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. స్థిరాస్తి విక్రయాలు తగ్గడం, మార్కెట్ అస్థిరత, యుద్ధ భయాలు, ఆర్థిక మాంద్యం వస్తుందనే ఊహాగానాల నేపథ్యంలో నగదు దొరకడం కష్టమవుతుందని కొందరు దాచేస్తున్నట్లు సమాచారం. ఒకవైపు మార్కెట్‌లో నగదు ఇబ్బంది ఎదురవుతుంటే, మరోవైపు సంపన్నుల వ్యక్తిగత లాకర్లలో నగదు నిల్వలు పేరుకుపోతున్నాయని పరిశీ లకులు వ్యాఖ్యా నిస్తు న్నారు. ఇప్పటికే మార్కెట్‌లో రూ.500 నోటు చలా మణి తగ్గుతూ వస్తోంది. బ్యాంకు లలో పలు సందర్భాలలో ఖాతాదా రులకు పెద్ద మొత్తంలో నగదు చెల్లించడానికి ఇబ్బందులు పడుతు న్నారు. ఆన్‌లైన్ పేమెంట్ ద్వారా లాభాలు ఉన్నట్లే, నష్టాలు కూడా కనిపిస్తున్నాయి.

యూపీఐలతో సులభతరం

స్మార్ట్‌ఫోన్ల వాడకం బాగా పెరగడం, గూగుల్ పే, ఫోన్, పేటీఎం, భీమ్ వంటి పలు యూపీఐలు అందుబాటులోకి రావడంతో సామాన్యులకు కూడా ఆన్‌లైన్ లావాదేవీలు చేయడం సులభతరమైంది. టీ, కాఫీ తాగినా, చిన్న బిస్కెట్ ప్యాకెట్ నుంచి కూరగాయలు, టెంకాయ నీళ్లు, ఇడ్లీ, దోశ కూడా ఆన్‌లైన్ పేమెంట్ చేసేస్తున్నారు. ఫలితంగా జిల్లాలో డిజిటల్ లావాదేవీలు బాగా పెరిగాయి. ముఖ్యంగా వర్తక, వాణిజ్యాలలో కొనుగోలుదారులు ఆన్‌లైన్ పేమెంట్ చేయడంతో చిల్లర సమస్య తగ్గడమే కాకుండా సమయం ఆదా అవుతోంది. దీంతో ఆన్‌లైన్ లావాదేవీల వైపు వర్తకులు మొగ్గుచూపుతున్నారు. పన్ను చెల్లింపు ఇబ్బంది ఉన్న వర్తకులు, నాలుగైదు ఆన్‌లైన్ ఖాతాలతో లావాదేవీలు జరుపుతున్నారు. అయితే టర్నోవర్‌ను బట్టి పన్ను చెల్లించాల్సిన పరిస్థితి ఉండడంతో కొంతమంది వర్తకులకు ఆన్‌లైన్ పేమెంట్లు ఇబ్బంది కలిగిస్తున్నాయి. ఇక, కొందరు వినియోగదారులు నెట్ బ్యాంకింగ్, ఫోన్ బ్యాంకింగ్ వంటి సదుపాయాల ద్వారా లావాదేవీలు కొనసాగిస్తున్నారు. బ్యాంకు ఖాతాలకు పెద్ద మొత్తాల్లో నగదు బదిలీలకు కూడా ఆన్‌లైన్ విధానాలనే అనుసరిస్తున్నారు. దీంతో నగదు చెలామణి బాగా తగ్గిపోయింది.

సీపెట్ డిప్లమో కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (హరనాథపురం), మే 23 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలోని భారత ప్రభుత్వ సంస్థ అయిన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ అండ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ (సీపెట్) డిప్లమో కోర్సులలో ప్రవేశానికి ఈనెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలని సీపెట్ డైరెక్టర్, సెంటర్ హెడ్ డాక్టర్ సీహెచ్ శేఖర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగ కల్పనే లక్ష్యంగా టెక్నికల్ డిప్లమో, పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లమో కోర్సులను సీపెట్ అందిస్తోందని తెలిపారు. 10వతరగతి విద్యార్హతతో 3 సంవత్సరాల డిప్లమో ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ (డీపీటీ), డిప్లమో ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ), బీఎస్సీ విద్యార్హతతో 2 సంవత్సరాల పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లమో ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ (పీజీడీ - పీపీటీ)అనే కోర్సులు సీపెట్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి ప్రముఖ బహుళ జాతి కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తా మని పేర్కొన్నారు. ఈ కోర్సులకు రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం కల్పించిందని తెలిపారు. 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు కూడా ఆన్‌లైన్ విధానంలో లింకు ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సీపెట్ అడ్మిషన్ టెస్ట్ (సీఏటీ)ను జూన్ 8వతేదీ నిర్వహిస్తారని తెలిపారు. అందులో వచ్చిన ర్యాంక్ ఆధారంగా విజయవాడ కేంద్రంలో గల 150 సీట్లను భర్తీ చేస్తారని వివరించారు. పూర్తి వివరాలకు 98404 06117 నెంబరును సంప్రదించాలని కోరారు.

మహానాడు జనసమీకరణ పరిశీలకుడిగా కోటంరెడ్డి

నెల్లూరు (వైద్యం), మే 23 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27, 28, 29 తేదీలలో కడపలో జరిగే తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమానికి వెంకటగిరి నియోజకవర్గం నుంచి జనసమీకరణ పరిశీలకుడిగా నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డికి టీడీపీ రాష్ట్ర కమిటీ బాధ్యతలు అప్పగించింది. ఆ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చేలా కృషి చేస్తామని ఈ సందర్భంగా కోటంరెడ్డి పేర్కొన్నారు.

రెండు బైక్‌ల ఢీ : యువకుడి మృతి

బుచ్చిరెడ్డిపాళెం, మే 23 (ఆంధ్రజ్యోతి) : రెండు బైక్‌లు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన కాగులపాడు సెంటర్‌లో ముంబయి జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. రేబాల పంచాయతీ అమ్మోరుతోపునకు చెందిన తమ్మిరెడ్డి శ్రీనివాసులు, సురేఖ దంపతులు తమ పిల్లలతో ఓ బైక్‌పై వెళుతుండగా, రోడ్డు దాటుతున్న మరో బైక్ అడ్డురావడంతో రెండూ ఢీకొన్నాయి. దీంతో రెండు బైక్‌లు తగిలి అటుగా వెళుతున్న పెనుబల్లికి చెందిన ఏడుకొండలు(35) తీవ్రంగా గాయపడి మృతి చెందినట్లు ఎస్ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రమాదంలో మొత్తం ఏడుగురికి గాయాలు అయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

122 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, (ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం రైతులు 468 పొగాకు బేళ్ల విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 346 బేళ్ల కొనుగోలు చేశారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.200, సగటు ధర రూ.246.48గా నమోదైంది.



పీహెచ్‌సీలలో ప్రసవ వేదన!

ఆశించిన స్థాయిలో జరగని కాన్పులు ● ఇలాగైతే ప్రభుత్వ లక్ష్యం నెరవేరేనా!?

నెల్లూరు (వైద్యం), మే 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఓ లక్ష్యాన్ని నిర్దేశించి దీనికి అనుగుణంగా ఆదేశాలిస్తున్నా ఆ అదేశాలను వైద్య ఆరోగ్యశాఖ తుంగలో తొక్కుతోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశీలించాల్సిన అధికారులు ఆ దిశగా కృషి చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇటీవల మార్చి నెలకు సంబంధించి ఆయా ఆరోగ్య కేంద్రాల పనితీరుపై గ్రేడ్‌లు ఇచ్చిన స్థితిలో నెల్లూరు నగరానికి కూతవేటు దూరంలో ఉన్న అల్లీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎలాంటి గ్రేడ్‌లకు నోచుకోలేదు. ఇదిలా ఉంటే ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రసవాల పరిస్థితి మరింత అగమ్య గోచరంగా మారుతోంది. ఒక్కో కేంద్రంలో ఇద్దరు వైద్యులు ఉన్నా ప్రభుత్వ లక్ష్యం ప్రకారం ప్రసవాలు జరగడం లేదు. ఇదేమని అధికారులను ప్రశ్నిస్తే సరిదిద్దుతామని చెబుతున్నారే తప్ప ఆచరణలో చేతులెత్తేస్తున్నారు.

నెలకు 10 ప్రసవాలు జరగాలి

జిల్లాలో మొత్తం 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా ఒక్కో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకు 10 ప్రసవాలు జరిగేలా ప్రభుత్వం ఓ లక్ష్యాన్ని నిర్దేశించింది. అయితే ఆ లక్ష్యాలను తుంగలో తొక్కుతున్న పీహెచ్‌సీలు తమ వద్దకు వచ్చే గర్భవతులను ప్రసవాల కోసం ఏరియా, జిల్లా ఆసుపత్రులకు రెఫర్ చేసి, చేతులు దులుపుకుంటున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోనే సాధారణ ప్రసవాలతోపాటు సిజేరియన్ ఆపరేషన్లు చేసే అన్ని వైద్య పరికరాలు నిపుణులైన వైద్యులు ఉన్నా అక్కడ ప్రసవాలు మాత్రం నామమాత్రంగా చేస్తున్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని చిత్తలూరు పీహెచ్‌సీలో 2024-25 కాలంలో ఒక్క ప్రసవం కూడా జరగలేదు. నెలకు 10 ప్రసవాల లెక్కన 52 పీహెచ్‌సీల పరిధిలో సంవత్సరానికి 6,240 ప్రసవాలు జరగాల్సి ఉన్నా కేవలం 498 ప్రసవాలు చేశారు. ఒక్కో పీహెచ్‌సీలో నెలకు 120 ప్రసవాలు చేయాల్సి ఉండగా, రెండంకెలు కూడా దాటలేదు. కేవలం రామతీర్థం పీహెచ్‌సీలో 30 ప్రసవాలు, లింగసముద్రంలో 27 ప్రసవాలు అత్యధికంగా జరిగినట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి.

ప్రసవాలు జరిగేలా మెరుగు పరుస్తాం



జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఆశించిన స్థాయిలో ప్రసవాలు జరిగేలా కృషి చేస్తున్నాం. ప్రతి పీహెచ్‌సీ పరిదిలో నెలకు 10 ప్రసవాలు జరగాల్సి ఉంది. దీనికి సంబంధించి స్పష్టమైన ఆదేశాలు కూడా ఇచ్చాం. ఏదైనా హైప్రెగ్నెన్సీ కేసులు వస్తేనే ఏరియా, జిల్లా ఆసుపత్రులకు సిఫారసు చేయాల్సి ఉంటుంది. అయితే కొన్ని కేసులను అవసరం లేక పోయినా పెద్దాసుపత్రులకు సిఫార్సు చేయడం సరికాదు. తక్కువ ప్రసవాలు జరిగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం.

- డాక్టర్ సుజాత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

2024-25 మధ్య కొన్ని పీహెచ్‌సీలలో జరిగిన ప్రసవాల సంఖ్య

పీహెచ్‌సీలు	ప్రసవాలు
చిత్తలూరు	0
గట్టుపల్లి	1
కొడవలూరు	1
మమ్మదాపురం	1
తుమ్మలపెంట	2
చిరమన	2
వేపినాపి	2
గిద్దలూరు	3
చాకలికొండ	3
నర్రవాడ	3
కోవూరుపల్లి	4
యల్లాయపాళెం	4
గండిపాళెం	4
ఇస్కపాళెం	4

'ఉపాధి' క్షేత్ర సహాయకురాలిపై విచారణ


సిబ్బందిని విచారిస్తున్న డ్వామా ఏపీడీ మృధుల

కొండాపురం, మే 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భీమవరప్పాడు ఉపాధి హామీ క్షేత్ర సహా యకురాలుపై గ్రామస్థుల ఫిర్యా దు మేరకు డ్వామా ఏపీడీ మృదుల శుక్రవారం గ్రామ సచి వాలయం వద్ద బహిరంగ విచారణ చేపట్టారు. కొంతకా లంగా ఉపాధి హామీ పనులకు సంబంధించి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ఎన్ఆర్ఐలు, వివాహమై ఇతర ప్రాంతాలకు వెళ్లిన వ్యక్తుల పేర్లను మస్టర్లలో నమోదు చేసుకోవడంతోపాటు ఒకరికి బదులు మరొకరిని పనుల్లో వినియోగిస్తూ క్షేత్ర సహాయకురాలు భాగ్యలక్ష్మి అవినీతికి పాల్పడినట్టు మాజీ సర్పంచు చాగంటి కృష్ణతోపాటు పలువురు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గ్రామంలో బహిరంగ విచారణ చేపట్టి పలువురి నుంచి రాతపూర్వక స్టేట్‌మెంట్లు సేకరించారు. దీనిపై సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి తదుపరి చర్యలు తీసుకుంటామని ఏపీడీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆదినారాయణ, ఏపీవో మురళి, వీఆర్వో పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ డివిజన్ ఈఈకి షోకాజు నోటీసు

● డీసిల్టింగ్‌లో అవకతవకలపై వివరణ ఇవ్వాలని ఆదేశించిన ఎస్ఈ

నెల్లూరు, మే 23 (ఆంధ్రజ్యోతి) : సంగం, నెల్లూరు బ్యారేజీల వద్ద జరుగుతున్న ఇసుక డీసిల్టింగ్ ప్రక్రియలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని పేర్కొంటూ ఇరిగేషన్ సెంట్రల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే నాగరాజుకు ఆ శాఖ ఎస్ఈ దేశానాయక్ షోకాజు నోటీసు ఇచ్చారు. చట్ట ప్రకారం తనపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. సూరాయపాలెం వద్ద ఓ కాంట్రాక్టర్ డ్రెడ్జింగ్ చేయకుండా నేరుగా భారీ యంత్రాలతో నదిలోనే ఇసుక తవ్వుతున్నా పట్టించుకోక పోవడం, నదిలో నీరు పారకుండా అడ్డంగా రోడ్డు వేసినా చర్యలు తీసుకోకపోవడంపై ఎస్ఈ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం మేజర్ ప్రాజెక్టులైన సం గం, నెల్లూరు బ్యారేజీ వద్ద డీసిల్టింగ్ అను మతులిచ్చే అధికారం సీఈకి ఉందని, మరి ఉన్నతాధికారులకు చెప్పకుండా డివిజన్ స్థాయిలోనే ఎలా అనుమతులు ఇచ్చారో వివరణ ఇవ్వాలంటూ ఎస్ఈ షోకాజు నోటీసులో పేర్కొన్నారు. అలానే రూ.40 లక్షలకు మించి టెండర్ పిలిచే అధికారం ఈఈకు లేదని, మరి రూ.కోట్లు విలువ చేసే డీసిల్టింగ్ టెండర్లను ఈఈ ఎలా పిలుస్తున్నారో కూడా వివరణ ఇవ్వాలంటూ ఆదేశించారు. దీనిని బట్టి చూస్తే డీసిల్టింగ్ ప్రక్రియలో భారీగా అవకతవకలు జరిగినట్లు స్పష్టమవుతోంది. అయితే మరో వారం రోజుల్లో పదవీ విరమణ చేయనున్న ఈఈ ఇప్పుడు షోకాజు నోటీసు అందుకోవడం ఇరిగేషన్ శాఖలో చర్చనీయాంశంగా మారింది.

చాముండేశ్వరి బ్రహ్మోత్సవాలపై సమీక్ష

ఇందుకూరుపేట, మే 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగపట్నంలో వెలిసి ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రమైనచాముండేశ్వరి బ్రహ్మోత్సవాలపై తహసీల్దారు కృష్ణప్రసాద్, ఆలయ కార్యనిర్వాహణాధికారి తాతా శ్రీనివాసులు అధ్యక్షతన శుక్రవారం సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దారు కృష్ణప్రసాద్ మాట్లాడుతూ జూన్ 2 నుంచి 13వ తేదీ వరకు జరిగే ఈ బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి లోటుపాట్లు, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. జూన్ 11, 13, 14వ తేదీల్లో ముఖ్య ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. బ్రహ్మోత్సవాలు సందర్భంగా జంతు బలులు నిషేధమన్నారు. ఈ కార్యక్రమంలో గుండాల కృష్ణారెడ్డి, సాయినిరంజన్, కొండూరు వెంకటరమణారెడ్డి, బొద్దుకూరు సుధీర్, మారుబోయిన జనార్ధన్‌గౌడ్, బీజేపీ మండల ఉపాధ్యక్షులు కేతిరెడ్డి అవినాష్‌రెడ్డి, అమ్మహేచరీస్ అధినేత దుగ్గా శంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


సమీక్ష సమావేశంలో పాల్గొన్న అధికారులు

కసుమూరు దర్గాలో భక్తుల రద్దీ

వెంకటాచలం, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలం లోని కసు మూరు మస్తాన్ వలి దర్గాలో శుక్ర వారం భక్తుల రద్దీ నెలకొంది. తమిళ నాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.


దర్గా ప్రధాన ద్వారం వద్ద నెలకొన్న భక్తుల రద్దీ

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

సీతారామపురం, మే 23 (ఆంధ్రజ్యోతి): మైనారిటీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో భాస్కర్ శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత, ఆసక్తి కలిగిన వారు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో స్థానిక సచివాలయం, మీసేవా కేంద్రాల్లో ఈ నెల 25 తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండలానికి ఏడు యూనిట్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9208
వెండి కిలో ధర	రూ. 100000
వెండి ఒక గ్రాము	రూ. 103.00



ఉపాధి కూలీల సంఖ్య పెంచేందుకు కృషి

● జ్ఞానప్రకాష్, ఇన్‌చార్జ్ ఏపీవో

సంగం, మే 23 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించి కూలీలకు పనులకు కల్పించేందుకు చేపట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఏపీవో బి జ్ఞానప్రకాష్ తెలిపారు.

? ఉపాధి హామీ పనుల్లో రోజువారి కూలీల సంఖ్య లక్ష్యం ఎంత. ప్రస్తుతం ఎంతమంది పనులకు వస్తున్నారు.

! రోజుకు 2వేల మంది కూలీలకు పనులు కల్పించాలన్నదే లక్ష్యం. కానీ వర్షాలు పడుతుండడంతో ప్రస్తుతం రోజుకు 700 మంది పనులు చేస్తున్నారు.

? కూలీల సంఖ్య పెంచేందుకు ఏం చర్యలు చేపడుతున్నారు.

! ప్రతి గ్రామంలో పనులు గుర్తించి మంజూరు ప్రతిపాదనలు పంపాం, పనులు మంజూరయ్యాయి. ప్రస్తుతం 10 పంచాయతీల్లో పనులు జరుగుతున్నాయి. మిగిలిన 10 పంచాయతీల్లో పనులు ప్రారంభించి కూలీల సంఖ్య రెండు వేలకు పెంచుతాం.

? మండలానికి ఎన్ని గోకులాలు మంజూరయ్యాయి. ఎన్ని పూర్తయ్యాయి.

! మండలానికి 54 గోకులాలు మంజూరవగా, ఇప్పటికి 20 పూర్తయ్యాయి. 16 నిర్మాణంలో ఉన్నాయి. మిగిలినవి ఇంకా పనులు ప్రారంభం కాలేదు.

? మండలానికి ఎన్ని నీటి తొట్టెలు మంజూరయ్యాయి. ఒక్కొక్క తొట్టె నిర్మాణానికి నిధులు ఎంత.

! మూడు తొట్టెలు మంజూరవగా, తరుణవాయిలో ఒకటి నిర్మించారు. కొరిమెర్లలో నిర్మాణంలో ఉంది. పెరమనలో త్వరలో ప్రారంభిస్తాం. ఒక్కొక్క తొట్టి నిర్మాణానికి రూ.9 వేలు ఇస్తాం.

న్యూస్ బాక్స్

ముగిసిన ఆంజనేయస్వామి ఉత్సవాలు



స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దుత్తలూరు (ఉదయగిరి)మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటంపేటలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న వీరాంజనేయస్వామి ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ముగిసాయి. చివరి రోజు వేదపండితులు సహస్రనామ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. మహిళలు ఆలయ ఆవరణలో పొంగళ్లు నిర్వహించి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేక వాహనంలో గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు. భక్తులు కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాద వితరణ చేపట్టారు.

కనుమరుగవుతున్న చేదురు బావులు

● శిథిలావస్థలో బావులు
● పొంచిఉన్న ప్రమాదాలు



ఉదయగిరిలోని సుద్ధబావి వీధిలో శిథిలావస్థకు చేరిన గిలక బావి



చేదురుబావిలో మొలచిన పిచ్చిమొక్కలు

ఉదయగిరి, మే 23 (ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాల క్రితం వరకు పల్లెల్లో ప్రజలకు తాగునీటి అవసరాల కోసం ఉపయోగపడిన చేదురు బావులు నేడు కనుమరుగవుతున్నాయి. నాడు పల్లెల్లో తెల్లవారుజామున వినిపించిన గిలకల శబ్దం మూగబోయింది. నీటి పరిరక్షణకు ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టకపోవడంతో కొన్నిచోట్ల అవి అన్యాక్రాంతమవుతున్నాయి. పలుచోట్ల జనవాసాల మధ్య ఉన్న మంచినీటి బావులు శిథిలావస్థకు చేరి ప్రమాదంగా మారడంతో స్థానికులు భీతిల్లుతున్నారు. మరికొన్నింటిని స్థానికులే కూల్చివేశారు. పూర్వీకుల నుంచి పల్లెల్లో మంచినీటి బావులు అనేకం ఉండేవి. రెండు దశాబ్దాల కిందట వరకు ఈ బావులే ఆయా ప్రాంతాల ప్రజల తాగునీటి అవసరాలకు ఆధారంగా ఉండేవి. అయితే కాలక్రమేణా వచ్చిన మార్పులతో పల్లెల్లో వీధివీధికి చేతిపంపులు దర్శనం ఇవ్వడంతో చేదురుబావులు నిర్లక్ష్యానికి గురయ్యాయి. అనంతరం ఓవర్‌హెడ్ ట్యాంకులు, వీధి కొళాయిలు, నీటి శుద్ధి కేంద్రాలు, ఇంటింటికీ క్యాన్ల ద్వారా నీటిని సరఫరా చేయడం ప్రారంభమైంది. దీంతో గ్రామాల్లోని మంచినీటి చేదురుబావులు నిరుపయోగంగా మారాయి. దీంతో ఈ బావులు ఆక్రమణలకు గురై కనుమరుగవుతున్నాయి.

శిథిలావస్థ బావులతో పొంచిఉన్న ప్రమాదం

దశాబ్దాల క్రితం నుంచి ఉన్న మంచినీటి బావులను నిరుపయోగంగా విడిచిపెట్టడంతో కొన్ని శిథిలావస్థకు చేరాయి. ఆవాసాల నడుమ ఉన్న ఈ బావుల సమీపంలో చిన్నారులు ఆటలాడుతుండడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయపడుతున్నారు. పూర్తిగా శిథిలావస్థకు చేరిన బావులను పూడ్చి ఆయా స్థలాల పరిరక్షణకు తగిన చర్యలు చేపట్టడంతోపాటు ఆయా బావుల్లో ఎవరూ పడకుండా ఉండేందుకు గ్రిల్స్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా సీతారాముల గ్రామోత్సవం



గ్రామోత్సవంలో సీతారామస్వామి

సంగం, మే 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక బజార్ సెంటర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతిని పురస్కరించుకుని గురువారం అర్ధరాత్రి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆంజనేయస్వామి, సీతారాముల ఉత్సవ విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా బాణా



సంగం, మే 23 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడిగా వెంకటేశ్వరపురం గ్రామానికి చెందిన బాణా శ్రీనివాసులురెడ్డిని నియమించారు. ఈసందర్భంగా ఆయన రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వం మారినా.. తొలగించని జగన్ ఫొటోలు



ఏఎస్ పేట పీహెచ్‌సీలో జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోతో ఉన్న ఆరోగ్యశ్రీ హెల్ప్ డెస్క్

ఏఎస్ పేట, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారి దాదాపు సంవత్సరం అవుతున్నా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఫొటోతో ఉన్న పోస్టర్లు తొలగించకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ద్వారా ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటుచేశారు. కానీ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పేరుతో దర్శనం ఇవ్వడంతో అధికారుల తీరును పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

తెరుచుకోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లు

● వైద్యసేవలు అందక గ్రామస్థుల అవస్థలు



వింజమూరులో తెరుచుకోని హెల్త్‌క్లినిక్

వింజమూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు తెరుచుకోక వైద్యసేవలు సక్రమంగా అందడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటుచేసిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదని, అరకొరగా వైద్యసేవలు అందుతున్నాయని వాపోతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, పలు కేంద్రాల్లో సిబ్బంది చుట్టపుచూపుగా వచ్చి వెళ్తున్నారని, కొన్నిచోట్ల కేంద్రాలు తెరుచుకోవడంలేదని విమర్శిస్తున్నారు. పలువురు అధికారులు కేంద్రాలకు వెళ్లకుండా పీహెచ్‌సీల్లోనే ఉంటున్నారని, దీంతో చిన్న రోగానికి కూడా దూరప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విలేజ్ హెల్త్ క్లినిక్‌లను అందుబాటులోకి తీసుకొచ్చి వైద్యసేవలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఉదయగిరి, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పప్పులవారిపల్లి గ్రామంలో సీతా రాముల ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా చేపట్టారు. ఈసందర్భంగా అర్చకులు స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కల్యాణోత్సవం నిర్వహించారు. వసంతోత్సవం, పారువేట కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామంతోపాటు పరిసర గ్రామాల భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారికి కాయాకర్పూరం అందజేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆర్లపడియలో

మండలంలోని ఆర్లపడియ గ్రామంలో సీతా రాముల ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణతంతు నిర్వహించారు. భక్తులు కల్యాణోత్సవాన్ని కనులారా తిలకించారు. గ్రామంతోపాటు పరిసర గ్రామాల భక్తులు స్వామివార్లకు కాయాకర్పూరం అందజేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మూఢ నమ్మకాలను విడనాడాలి : జేవీవీ



మాట్లాడుతున్న కుమ్మిత శ్రీనివాసులురెడ్డి

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మే 23 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రజలందరూ మూఢ నమ్మకాలను విడనాడి శాస్త్ర విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జేవీవీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ కుమ్మిత శ్రీనివాసులురెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన మండల మహాసభలో ఆయన మాట్లాడుతూ శాఖ తరఫున తాము చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. అనంతరం జరుగనున్న జిల్లా మహాసభ నిర్వహణ, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు వైవీ సుబ్బయ్య, వీ చక్రపాణి, పీ మాల్యాచలం, పీ చెన్నకేశవులు, నాగార్జునరావు, మానవత సంస్థ కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

జేవీవీ మండల కమిటీ ఎన్నిక

జేవీవీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ కుమ్మిత శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో మండల శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఎం సుబ్బారావు, వైవీ సుబ్బయ్య, అధ్యక్షుడిగా షేక్ కరీముల్లా, ఉపాధ్యక్షులుగా ఎం ఆంజనేయులు, పీ రసూల్, ప్రధాన కార్యదర్శిగా డీవీ రమణయ్య, కోశాధికారిగా టీ హజరత్తయ్య, సమన్వయకర్తలుగా పీ చెన్నకేశవులు, ఎస్ రమణయ్య ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో 15 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు పలువురు ప్రత్యేక అభినందనలు తెలిపారు.


వివాదాస్పద భూమిని పరిశీలించిన ఆర్డీవో

ఉదయగిరి, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నేపల్లి రెవెన్యూ జెట్టివారిపల్లి గ్రామంలో 41/2లో 4.14 ఎకరాల వివాదాస్పద భూమిని జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆత్మకూరు ఆర్డీవో పావని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె భూమికి సంబంధించిన అన్ని రికార్డులను పరిశీలించారు. అలాగే ఇరువర్గాలతో మాట్లాడడంతోపాటు గ్రామస్తులను విచారించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సుభద్ర, రీసర్వే డిప్యూటీ తహసీల్దారు జహీర్, వీఆర్వో అంజాద్, సర్వేయరు రవీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.



శుభ్రతకు నోచుకోని మంచినీటి ట్యాంకులు

● కానరాని తాగునీటి పరీక్షలు ● విజృంభిస్తున్న వ్యాధులు ● గ్రామస్థుల అవస్థలు



శుభ్రతకు నోచుకోని రక్షిత ఓవర్‌హెడ్ ట్యాంకు

ఉదయగిరి రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రక్షిత మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయకపోవడంతో వ్యాధులకు గురికావల్సి వస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతినెలా ట్యాంకులను శుభ్రం చేయాల్సి ఉన్నా అంతంతమాత్రంగానే చేస్తున్నారు. ప్రజలు ఫిర్యాదులు చేస్తే తప్ప పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గ్రామీణ నీటి సరఫరా విభాగానికి కేవలం ఎనిమిది నీటి పరీక్షా కేంద్రాలు మాత్రమే ఉన్నాయి. ఆ కేంద్రాలకు ఎప్పుడు తలుపులు తీస్తారో, ఎప్పుడు మూస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఆ కేంద్రాలలో పని చేసే సిబ్బంది గ్రామాల్లో నీటిని తీసుకొచ్చి రెండు రకాల పరీక్షలు చేయాలి. అందులో ఒకటి రసాయనాల పరీక్ష, మరొకటి బ్యాక్టీరియా రిజికల్ పరీక్షలు. ఇలా ప్రతి నీటి పరీక్షా కేంద్రంలో సుమారు 250 పరీక్షలను తప్పక చేయాలనే నిబంధన ఉన్నప్పటికీ అవి కేవలం రికార్డులు రాసుకోవడానికే పరిమితమవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే సురక్షిత నీటిని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. వాటిలో బ్యాక్టీరియా ఉంటే అక్కడ తాగునీరు క్లోరినేషన్ చేయడం, వాటర్ ట్యాంకులను శుభ్రంచేయడం వంటి పనులను అధికారులు చేపట్టాల్సి ఉంది. కాగా, పైపులైన్‌ల లీకేజీలు, వాల్వు వద్ద మురుగు నీరు పైపుల్లోకి పోవడం, ట్యాంకులు శుభ్రం చేయకపోవడం వంటి కారణాలతో బ్యాక్టీరియా పెరిగే అవకాశముంది. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పనిచేస్తే వ్యాధులను నివారించవచ్చని, ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్యాంకుల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

C.R.I.M.E N.E.W.S



కోవూరు పోలీసులు స్వాధీనం చేసుకున్న గోవులు

అక్రమంగా తరలిస్తున్న గోవుల స్వాధీనం

కోవూరు, మే 23(ఆంధ్రజ్యోతి): గోవధకు అక్రమంగా తరలిస్తున్న 45 గోవులను కోవూరు పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. తిరపతి జిల్లా చిల్లకూరు మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి కొనుగోలు చేసి గోవధకు దూరప్రాంతానికి తరలించేందుకు సిద్ధం చేశారు. వీటన్నింటిని కోవూరు మండల పరిధిలోని జాతీయ రహదారి పక్కన భారత్ గ్యాస్ గోదాము వెనుక భాగంలోని ప్లాట్లలో ఉంచి రవాణా చేసే వాహనం కోసం ఎదురు చూస్తుండగా ఈ సమాచారం పోలీసులకు అందింది. దీంతో సీఐ సుధాకరరెడ్డి, ఎస్ఐ రంగనాథ్‌గౌడ్, పోలీసు సిబ్బందితో కలసి హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకున్నారు. దీంతో ఆ గోవులకు సంబంధించిన వ్యక్తులు అక్కడి నుంచి పరారయ్యారు. పోలీసులు గోవులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎక్సైజ్ అధికారుల రాత్రి గస్తీ

● మద్యం దుకాణాలు, బార్ల వేళలపై నిఘా

నెల్లూరు(క్రైం), మే 22 (ఆంధ్రజ్యోతి) : ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారులు, స్టేట్ టాస్క్‌ఫోర్స్ విజయవాడ బృందంతో కలిసి గురువారం రాత్రి నెల్లూరులో గస్తీ నిర్వహించారు. మద్యం షాపులు, బార్ల సమయపాలన కచ్చితంగా పాటిస్తున్నారా?, అనధికారికంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయా? అని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ జిల్లా డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాత్రి గస్తీ నిర్వహించామని చెప్పారు. మద్యం షాపులు, బార్లు నిర్దేశిత వేళలు తప్పని సరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ దయాసాగర్, స్టేట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్ మధు, అదనపు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ జగదీష్, ఇన్‌స్పెక్టర్లు బాలనర్సింహ, వై వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వివాహితకు లైంగిక వేధింపులు

నెల్లూరు(క్రైం), మే 23 (ఆంధ్రజ్యోతి) : 'నాతో నీవు తీసుకున్న ఫొటోలు ఉన్నాయి.... నా కోర్కె తీర్చకుంటే వాటిని అందరికీ చూపించి నిన్ను అల్లరి చేస్తా'నంటూ వివాహితను ఓ వ్యక్తి లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడు. అతని వేధింపులు తాళలేని బాధితురాలు తన భర్త సహకారంతో పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని కరెంటాఫీసు సెంటర్ సమీపంలో ఓ కుటుంబం నివసిస్తోంది. భార్య, భర్త ఇద్దరు పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వివాహిత తన సమీప బంధువు వెంకటేశ్వర్లుతో కుటుంబ విషయాలను చెప్పుకుంటూ సన్నిహితంగా ఉండేది. అతని ప్రవర్తనలో మార్పు రావడాన్ని గమనించిన వివాహిత అతన్ని దూరం పెట్టడం ప్రారంభించింది. దీంతో కోపోద్రిక్తుడైన వెంకటేశ్వర్లు తన కోర్కె తీర్చాలంటూ వివాహితను వేధించసాగాడు. ఈ విషయాన్ని భర్తతో చెప్పడంతో అతను వెంకటేశ్వర్లును మందలించాడు. అయినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. వివాహితతో తీసుకున్న ఫొటోలను బంధువులకు పంపించాడు. దీంతో బాధితురాలు భర్తతో కలిసి గురువారం రాత్రి వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆరోగ్య సమస్యలతో ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), మే 23 (ఆంధ్రజ్యోతి) : ఒంటరితనం, ఆరోగ్య సమస్యలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల సమాచారం మేరకు... కృష్ణ జిల్లా గుడివాడకు చెందిన నరేష్‌కుమార్ (40), రఫియాబేగం ఏడేళ్లకిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి ఆరేళ్ల కుమారుడున్నాడు. నరేష్ కుమార్ పలు వ్యాపారాలు చేస్తూ మద్యానికి బానిసయ్యాడు. అనారోగ్యానికి గురికావడంతో గుండె ఆపరేషన్ చేయించుకున్నాడు. అయినా అతను మద్యం మానకపోవంతో సంవత్సరం క్రితం భార్య అతనిని వదిలి పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి నరేష్‌ను తల్లి రమాసుందరి చూసుకుంటోంది. వారిద్దరు ఆరు నెలల క్రితం నెల్లూరులోని జనార్దన్‌రెడ్డి కాలనీలో ఉంటున్న రమాసుందరి సోదరి పద్మావతి ఇంటికి వచ్చారు. స్థానికంగా ఓ ఇల్లు అద్దెకు తీసుకుని జీవిస్తున్నారు. ఒంటరితనం, అనారోగ్యంతో నరేష్‌కుమార్ బాధపడుతూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో గురువారం ఇంట్లో తల్లి లేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాత్రి ఇంటికి వచ్చిన తల్లి కుమారుడిని చూసి కన్నీరుమున్నీరైంది. శుక్రవారం తెల్లవారుజామున నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ రెహమాన్ మృతదేహాన్ని పరిశీలించి జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గోకులం షెడ్ల బిల్లుల కోసం

లబ్ధిదారుల ఎదురుచూపు

మర్రిపాడు, మే 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద గోకులం షెడ్లు నిర్మించుకున్న రైతులు బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. నెలలు గడుస్తున్నా బిల్లులు రాకపోవటంతో వడ్డీలు కట్టడానికి అవస్థలు పడుతున్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని 6 మండలాల్లో 258 షెడ్లు మంజూరయ్యాయి. 6 పశువులు గల షెడ్డుకు రూ. 2.30లక్షలు, 4 గేదెల షెడ్డుకు రూ. 1.85లక్షలు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోంది. ఈ పథకం మొత్తం విలువలో 10శాతం లబ్ధిదారుడు చెల్లిస్తే మిగిలిన మొత్తం రాయితీ వర్తించనుంది. కాగా, మర్రిపాడు మండలంలో 54 గోకులం షెడ్లు మంజూరు కాగా 41 పూర్తయ్యాయి. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. కాగా, బిల్లుల మంజూరుకు ఎదురుచూడాల్సి వస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు. అప్పులు చేసి నిర్మాణాలు చేపట్టామని.. వడ్డీ పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

త్వరలో లబ్ధిదారుల ఖాతాలకు నగదు జమ : ఏపీవో

త్వరలో లబ్ధిదారుల ఖాతాలకు నగదు జమ అవుతాయని ఏపీవో నారాయణ తెలిపారు. గోకులం షెడ్లకు సంబంధించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. నిధులు విడుదల కాగానే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఆపరేషన్ కగార్ పేరుతో హత్యాకాండ

● సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి పోలయ్య

సైదాపురం, మే 23 (ఆంధ్రజ్యోతి): గత సంవత్సర కాలంగా మధ్య భారత అడవుల్లో భారత ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో హత్యా కాండను కొనసాగిస్తోందని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డీపీ పోలయ్య ఖండించారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ సీపీఐ మావోయిస్టు పార్టీ కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బస్వరాజ్‌తో సహా 27 మందిని బూటపు ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చి చంపడాన్ని ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	133
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	264

కోడిగుడ్ల ధర (100): 530

ప్రభుత్వ పథకాలు వినియోగించుకోండి

కలిగిరి, మే 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఎంపీడీవో ప్రత్యూష పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా సన్న చిన్నకారు రైతులకు పండ్ల, పూల తోటలు, పొలంలో అభివృద్ధి పనులకు సంబంధించి శుక్రవారం అనంతపురం, కావలిముస్తాపురం, వెలగపాడు గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆసక్తిగల రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సన్న, చిన్నకారు(స్మాల్ ఫార్మర్) సర్టిఫికేట్, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు తప్పనిసరిగా దరఖాస్తుతోపాటు తప్పనిసరిగా అందించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కావలిముస్తాపురం, వెలగపాడు సర్పంచులు పోలవరపు సుబ్బనాయుడు, దేవనబోయిన హజరత్తయ్య, ఎంపీటీసీ సభ్యుడు గాలి రమణయ్య, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఆదాయం కోసం ఆచారాన్ని మంట కలపొద్దు

కందుకూరు, మే 23(ఆంధ్రజ్యోతి): కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయానికి ఆదాయం కోసం ఆలయ ఆచార వ్యవహారాలను తుంగలో తొక్కేలా అధికారపార్టీ ప్రజాప్రతినిధులు ప్రయత్నిస్తుండటం తగదని ఆమ్ ఆద్మీ పార్టీ జోనల్ కన్వీనర్ నేతి మహేశ్వరరావు విమర్శించారు. శుక్రవారం సాయంత్రం ఆయన అంకమ్మ దేవాలయాన్ని సందర్శించి పూజారులు, ఆచారస్తులతో సమావేశమై షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం జరుగుతున్న ప్రయత్నాలపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంకమ్మ ఆలయం 29 దేవరలతో చుట్టుపక్కల అన్ని గ్రామాలతో కలుపుకుని వివిధ కులాలు, వర్గాలకు సంబంధించిన మిరాశిదారులతో 45 రోజుల పాటు ఘనంగా తిరుణాళ్ల జరుపుకునే ఆలయమని, అంతటి వైభవం కలిగిన ఈ ఆలయ ప్రాంగణంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే ఆలయ ఆచారాలన్నీ మరుగున పడిపోతాయన్నారు. అమ్మవారి జాతర జరుపుకునే అవకాశం కూడా లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అంకమ్మగుడి నిర్వహణ ఖర్చులపేరుతో షాపింగ్‌కాంప్లెక్స్ అంటున్నారని, అయితే తిరుణాళ్లకు ఆచారస్తులు సిద్ధపడిన నాడు దుకాణాలన్నీ తొలగించాల్సి వస్తుందన్న విషయం మర్చిపోరాదని ఆయన పేర్కొన్నారు.

నేడు ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి రాక



లింగసముద్రం ఉన్నత పాఠశాలలో ప్రారంభానికి సిద్ధమైన వాటర్ ప్లాంట్

లింగసముద్రం, మే 23(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావులు శనివారం లింగసముద్రం హైస్కూల్‌కు రానున్నట్లు ప్రధానోపాధ్యాయుడు ఉమ్మడిశెట్టి మాధవరావు ఓ ప్రకటనలో తెలిపారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు అంగుళూరి నరసింహారావు తన సొంత నిధులు 1.50 లక్షలతో నిర్మించిన గదిలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తన వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా సుమారు రూ.5 లక్షలతో మినీ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారని తెలిపారు. వీటిని ఉదయం 9 గంటలకు ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రారంభిస్తారని తెలిపారు.

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

కావలిరూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): కావలి మండలం మన్నంగిదిన్నె పంచాయతీ మోర్లవారిపాలెం సమీపంలోని పొలాల్లో కోడి పందేల స్థావరంపై శుక్రవారం పోలీసులు దాడులు చేశారు. రూరల్ సీఐ రాజేశ్వరరావుకు అందిన సమాచారం మేరకు ఎస్ఐ బాలకృష్ణయ్య తన సిబ్బందితో కలిసి నిర్వహించిన ఈ దాడుల్లో కోడి పందేలు ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 1 కోడిపుంజు, రూ.1580 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అగ్నిప్రమాద బాధితుడికి రెడ్‌క్రాస్ చేయూత



అగ్నిప్రమాద బాధితుడు మధుబాబుకి రిలీఫ్‌కిట్లు అందచేస్తున్న రెడ్‌క్రాస్ బాధ్యులు

కావలి, మే 23(ఆంధ్రజ్యోతి): కొండాపురం మండలం రామానుజపురంకు చెందిన అగ్నిప్రమాద బాధితుడు మధుబాబుకు శుక్రవారం కావలి రెడ్‌క్రాస్ భవనంలో రెడ్‌క్రాస్ రిలీఫ్ కిట్లను అందచేశారు. ఇటీవల మధుబాబు ఇల్లు కాలిపోయి సర్వం కోల్పోవడంతో ఆయన కావలి రెడ్‌క్రాస్‌ను సంప్రదించారు. దీంతో రెడ్‌క్రాస్ తక్షణ సహాయం కింద వంటపాత్రలు, దుస్తుల కిట్లను అందచేసింది. ఈ కర్యాక్రమంలో రెడ్‌క్రాస్ బాధ్యులు డీ.రవిప్రకాష్, కే.హరినారపరెడ్డి, నల్లిపోగు ప్రణీత, బీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకో..!

- కావలి కాలువ కింద పూర్తి స్థాయిలో రెండో పంటకు సాగునీరు
- సోమశిల జలాలతో పాటు వర్షం నీటితో సీబీఆర్‌లో జలకళ
- బోరుబావుల కింద ముందుగానే నారుమడులు
- వరి సాగుకు సమాయత్తమైన రైతులు
- వ్యవసాయ కూలీలకు వేసవిలో పనులు



సోమశిల జలాలతో పాటు వర్షపునీరు చేరడంతో నిండుకుండను తలపిస్తున్న చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయరు

జలదంకి, మే 23(ఆంధ్రజ్యోతి) : సోమశిల ప్రాజెక్ట్ నిర్మాణం జరిగిన 50 ఏళ్ల తరువాత మెట్టప్రాంతగా పిలువబడే కావలి కాలువ ఆయకట్టుకు పూర్తిస్థాయిలో 74 వేల ఎకరాలకు రెండో పంటకు సాగునీటి కేటాయింపులు చేశారు. గత కొన్నేళ్లగా పెన్నానదిపై సంగం బ్యారేజీ నిర్మాణం తరువాత కావలి కాలువ ఆయకట్టు డెల్టా ప్రాంతంతో సమానంగా రెండు పంటలకు సోమశిల జలాలు పంపిణీ జరుగుతాయనుకున్న ఆయకట్టు రైతుల కల ఈ ఏడాదితో నెరవేరింది. సోమశిలప్రాజెక్టలో 40 టీఎంసీలకు పైగా నీరు నిల్వ ఉండడంతో ఇటీవల నెల్లూరులో జరిగిన ఐఏబీ (జిల్లా సాగునీటి సలహా మండలి) సమావేశంలో కావలి కాలువ కింది పూర్తి ఆయకట్టుకు సాగునీటి కేటాయింపులు చేస్తూ అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఈ ప్రాంత అన్నదాతల కల ఆ నాటితో నెరవేరినట్లయింది. అయినా నిన్నమొన్నటి వరకు సక్రమంగా కాలువలకు నీరు వస్తాయో, రావోననే అనుమానంతో రైతులందరూ సాగుకు సిద్ధం కాలేదు. కొందరు రైతులుమాత్రమే వ్యవసాయ బోర్లు, బావుల కింద ఈనెల మొదటి వారంలోనే వరినారుమళ్లు పోశారు. కాగా మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో రైతుల్లో మనోధైర్యం ఏర్పడి కావలి కాలువ ఆయకట్టు కింద వరి నారుమళ్లు జోరుగా పోస్తున్నారు. అలాగే అటు సోమశిల జలాలు, ఇటు అకాల వర్షంతో వస్తున్న నీరుతో చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నిండుకుండను తలపిస్తోంది. ముందుగా నారుమడులు సిద్ధం చేసుకున్న రైతులు వరినాట్లు వేసేందుకు ట్రాక్టర్లతో దుక్కులు చేస్తున్నారు. గ్రామాల్లో వ్యవసాయపనులు ముమ్మరం కావడంతో కూలీలకు ఉపాధి దొరుకుతోంది. మామూలుగా ఈ ప్రాంతంలో ప్రతి ఏడాది ఒక్క పంట మాత్రమే వరిసాగు జరిగేది. దీంతో వ్యవసాయ కూలీలకు వేసవిలో పని దొరికేది కాదు. కానీ ఈ ఏడాది మాత్రం వేసవిలో కూడా పనులు దొరుకుతుండడంతో వ్యవసాయ ౹కూలీలలో ఆనందం వ్యక్తమవుతోంది.

● ఎరువులు, విత్తన దుకాణాలు కళకళ

కావలి కాలువ కింద సుమారు 74 వేల ఎకరాల్లో రెండో పంట సాగుచేసేందుకు అవకాశం లభించడంతో కావలి పట్టణం, జలదంకి, బోగోలు తదితర ప్రాంతాల్లో ఎరువులు, విత్తన దుకాణాలు రైతన్నలతో కళకళలాడుతున్నాయి. దుకాణదారులకు వ్యా పారం వేసవిలో కూడా జరుగుతుండడంతో వ్యాపారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. సాధారణంగా నవంబరు నుంచి మార్చి మాసాల మధ్య కాలంలోనే ఎరువుల దుకాణాల్లో వ్యాపారం ఉం టుంది. కానీ ఈ ఏడాది అందుకు భిన్నంగా ఈ ఏడాదంతా వీరికి వ్యాపారం జరగనుంది.

● రైతులకు సలహాలు అవసరం

కావలి కాలువ కింద ఆయకట్టు రైతులకు రెండో పంటగా వరి సాగు మొదటి సారి కావడంతో వీరికి వ్యవసాయశాఖ అధికారులు సాగులో మెలకవలతో కూడిన సూచనలు, సలహాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా విత్తనశుద్ధి నుంచి నారుమడి పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మం దుల వాడకంపై అవగాహన కల్పిస్తే రైతులకు ప్రయోజనం ఉంటుంది. దీనితో అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు.



అన్నవరంలో బోరుబావి కింద సిద్ధం చేసుకున్న నారుమడి

టీడీపీ హయాంలోనే కాలువ అభివృద్ధి

జలదంకి, మే 23(ఆంధ్రజ్యోతి) : కావలి కాలువ అభివృద్ధి నాడు, నేడు టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి జరిగింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సంగం వద్ద సోమశిల జలాలు వదిలితే చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయరుకు చేరాలంటే వారం రోజులపైనే పట్టేది. కాలువ పూడికతో నిండి, తూములు మరమ్మతులకు గురైనా పట్టించుకునే నాథుడు లేక సాగునీటి కోసం రైతులు అల్లాడిపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సాగునీటిరంగంపై దృష్టిపెట్టి గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకుండా వదిలేసిన కావలి కాలువ పూడికతీతకు రూ.3.78 కోట్లు కేటాయించారు. దీంతో నెలరోజుల వ్యవధిలో 56 కిలోమీటర్లు పొడవునా పూడికతీత పనులు పూర్తి చేయించి కాలువకు ఇరువైపులా జీప్‌ట్రాక్‌పై ఉన్న చెట్లను తొలగింపజేశారు. నాడు కావలి ఎమ్మెల్యేగా ఉన్న వంటేరు వేణుగోపాల్‌రెడ్డి బ్రాహ్మణక్రాకలో జన్మభూమి సభకు హాజరైన అప్పటి సీఎం చంద్రబాబునాయుడుకు కావలికాలువ దుస్థితి వివరించడంతో ఆ సభలోనే రూ.కోటి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. వెంటనే ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో అప్పట్లో పూడికతీత పనులు చేశారు. తదనంతరం ఉదయగిరి ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు బీద సోదరులతో కలసి మరోసారి కావలికాలువ దుస్థితిపై అప్పటి సీఎం చంద్రబాబుకు వివరించి కాలువ స్థిరీకరణకు, సీబీఆర్‌కు పైభాగాన బైపాస్ కాలువకు రూ.45 కోట్లు మంజూరు చేయించారు. దీంతో సంగం నుంచి కాలువ చివరి వరకు వెడల్పు పనులు చేపట్టడంతో 500 క్యూసెక్కులకు పరిమితమైన కాలువలో నేడు 1000 క్యూసెక్కులు ప్రవహిస్తోంది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ కాలువకు ఒక్కరూపాయి విదల్చలేదు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్నా ఇకసారి రూ.2కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుతం కావలి, ఉదయగిరి ఎమ్మెల్యేలు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, కాకర్ల సురేష్‌లు కాలువ పూడికతీత, తూముల మరమ్మతులు, గేట్లు దుస్థితిని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పూడికతీతకు రూ.3.78 కోట్లు మంజూరు చేయించి పనులు పనులు పూర్తిచేయించారు. దీంతో ఈనెల 15న సంగం వద్ద 700 క్యూసెక్కుల సోమశిల జలాలు కావలికాలువకు విడుదల చేయగా 16వ తేదీకి 24 గంటల వ్యవధిలో 50 కిలోమీటర్లు దూరంలో ఉన్న చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయరు చేరాయి. దీంతో గురువారానికి సీబీఆర్‌లో 192 ఎంసీఎఫ్‌టీ నీరు చేరి రిజర్వాయరు పూర్తిస్థాయిలో నిండిపోయింది. దీంతో రైతులు సీఎం చంద్రబాబును, ఎమ్మెల్యేలను ప్రశంసిస్తున్నారు.



కావలి కాలువ పూడికతీతతో సజావుగా సీబీఆర్‌కు చేరుతున్న సోమశిల జలాలు

బాలికల ఉజ్వల భవిష్యత్ కోసమే కిశోరి వికాసం



వలేటివారిపాలెం : పోకూరు అంగన్‌వాడీ కేంద్రంలో బాలికలకు కిశోరి వికాశంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సునీత



బిట్రగుంట : కిశోరి వికాసంపై గోడపత్రిక ఆవిష్కరించి అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సుప్రజ

వలేటివారిపాలెం, మే 23(ఆంధ్రజ్యోతి) : యుక్త వయస్సులో ఉన్న బాలికల ఉజ్వల భవిష్యత్‌కు కిశోరి వికాసం కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత తెలిపారు. మండలంలోని పోకూరు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం బాలికలకు కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్త సరస్వతి, హెల్పర్‌లు నయోమి, శ్యామల, బాలికలు, తదితరులు పాల్గొన్నారు.

విద్య, వ్యక్తిగత పరిశుభ్రత అవసరం

బిట్రగుంట : కిశోర బాలికలకు ముఖ్యంగా విద్య, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన అవసరమని సూపర్‌వైజర్ సుప్రజ అన్నారు. బోగోలు మండలంలోని బీజీవీ కండ్రిక, కమ్మవారిపాలెం అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం జరిగిన కిశోరి వికాశం కార్యక్రమాల్లో సూపర్‌వైజర్ సుప్రజ పాల్గొని కిశోరి బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దీంతో పాటు ప్రభుత్వం అందచేస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు. సూపర్‌వైజర్ కోటేశ్వరి ఆధ్వర్యంలో ఉమామహేశ్వరపురంలో జరిగిన కార్యక్రమంలో ఎంఎస్‌కే మౌనిక, ఈఏ భరత్, ఏఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ల పేరుతో సీసీ రోడ్లు ధ్వంసం

● పట్టించుకోని అధికారులు



ఆర్వోబీ వంతెన కింది దక్షిణ అప్రోచ్ రోడ్డులో సీసీ రోడ్డును పగలకొడుతున్న ప్రైవేట్ వ్యక్తులు

కావలి, మే 23(ఆంధ్రజ్యోతి): పైపులైన్ల పేరుతో ప్రైవేట్ వ్యక్తులు సీసీ రోడ్లు ధ్వంసం చేస్తున్నా మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అసలే అధ్వానంగా ఉన్న రోడ్లు బాగుచేయడం కనాకష్టంగా ఉన్నా పట్టణంలో బాగున్న రోడ్లను ధ్వంసం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. పట్టణంలోని ఉదయగిరి రైల్వే ఓవర్ బ్రిడ్జికి దక్షిణ వైపున ఉన్న అప్రోచ్‌రోడ్డుకు ఎంతో పోరాటఫలితంగా గత టీడీపీ ప్రభుత్వంలో సీసీ రోడ్డు వేశారు. దీంతో రాకపోకలకు అనువుగా ఉన్న ఆ రోడ్డును ప్రైవేట్ వ్యక్తులు తమ ఆక్రమణలలో ఉన్న స్థలానికి మంచి నీటి పైపులైన్ల కోసం శుక్రవారం సీసీ రోడ్డు పగులకొట్టారు. వాస్తవంగా మంచినీటి కుళాయి కనెక్షన్ తీసుకోవాలంటే మున్సిపాల్టీకి డిపాజిట్ కట్టి సీసీరోడ్డు కట్ చేయాలంటే దానిని కట్ చేసేందుకు తిరిగి కాంక్రీట్‌తో నిర్మాణం చేపనట్టేందుకు అయ్యే మొత్తం మున్సిపాల్టీకి చెల్లించాలి. దీంతో మున్సిపాల్టీ నిబంధనల మేరకు రోడ్డు కట్ చేసి కనెక్షన్ ఇస్తారు. కానీ కావలిలో మున్సిపల్ అనుమతులు లేకుండా ఎవరికి వారు ఇష్టానుసారంగా రోడ్లు పగుల కొట్టి కుళాయి కనెక్షన్‌లు వేసుకుంటున్నా అడిగేవారు లేరు. మున్సిపల్ అధికారులు స్పందించి ప్రభుత్వ నిబంధనలు అమలు చేసి మున్సిపల్ ఖజానాకు నష్టం జరుగకుండాచూడడంతో పాటు రోడ్లు ధ్వంసం కాకుండా చూసుకోవాలన్నారు.

అకాల వర్షం జామాయిల్‌కు మేలు!

● పూర్తిస్థాయిలో భూముల పదును ● దుక్కులు దున్ని ఎరువులు వేసేందుకు కర్షకుల సన్నద్ధం



కందుకూరు ప్రాంతంలో సాగు చేసి ఉన్న లేత జామాయిల్ తోట

కందుకూరు, మే 23(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా మండువేసవిలో ఉష్ణతాపం నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించటమే గాక జామాయిల్ తోటలు పెంచుతున్న రైతులకు ఎంతో మేలు చేస్తోంది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కందుకూరు ప్రాంతంలో మూడు రోజుల పాటు కురిసిన వర్షాలతో ఈ ప్రాంతంలో భూములు పూర్తిస్థాయిలో పదునెక్కి పంటలకు ఎంతో మేలుచేసిందని చెబుతున్నారు. వేలాది ఎకరాలలో సాగుచేసి ఉన్న జామాయిత్‌తో పాటు వేసవి పంటలుగా సాగు చేసిన నువ్వు, పెసర, పొద్దుతిరుగుడు, వేరుశనగ సాగుకి ఈ వర్షం ఎంతో ఉపయోగపడుతుంది. కొన్ని దశాబ్దాలుగా కందుకూరు ప్రాంతంలో జామాయిల్ సాగు అత్యధిక సాగువిస్తీర్ణంలో చేపడుతారు. దీనికితోడు రెండేళ్లగా అనూహ్యంగా జామాయిల్ కర్రకు మంచి గిట్టుబాటు ధర లభించడంతో ఈ ఏడాది వేలాది ఎకరాల్లో తోటలు సాగుచేసి ఉన్నారు. మొత్తంగా కందుకూరు డివిజన్‌లో కనీసం 60వేల ఎకరాలకు పైనే జామాయిల్ సాగు జరిగి ఉందని అంచనా. లేత జామాయిల్ ఎండల ప్రభావంతో కునారిల్లుతాయని రైతులు రుతుపవనాల కోసం ఎదురుచూస్తున్న తరుణంలో అనూహ్యంగా ఉపరితల ఆవర్తనం ఈ ప్రాంతంలో సరాసరిన 6 సెం.మీటర్ల వర్షం కురవటంతో భూములు పూర్తిస్థాయిలో నీరు తాగటమే గాక కుంటలు, చెక్‌డ్యాంలకు ఓమోస్తరు నీరుకూడా చేరింది. దీనికితోడు ఈనెలాఖరులోగా నైరుతి రుతుపవనాలు కూడా వస్తాయని ఇందుకు అనుకూల వాతావరణం ఏర్పడిందని వాతావరణశాఖ అధికారులు ప్రకటించటంతో రైతులు జామాయిల్ సాగుచేసిన భూముల్లో సేద్యాలుచేసి ఎరువులు పెట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. సాధారణ పరిస్థితుల్లో అయితే తొలకరి వర్షాలకు భూములు పదునైతే ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో ఎరువులు వేసేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి. కానీ ఈ ఏడాది మేలోనే ఎరువులు వేసేందుకు అనుకూల పరిస్థితులు రావడంతో లేత జామాయిల్ సాగు చేసిన రైతులు ఎంతో ఆనందిస్తున్నారు. ప్రస్తుతం భూమిలో ఉన్న పదునుతో ఎరువులు వేస్తే నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఈ నెలాఖరు నుంచి జూన్ ప్రథమార్థంలోగా వర్షాలు పడనున్నందున ఎరువులు బాగాపట్టి చెట్లు ఏపుగా పెరుగుతాయని, దీనివల్ల సాధారణ సమయం కన్నా ఆరు నెలలు ముందే తోటలు కటింగ్‌కు వచ్చేలా పెంచుకునే అవకాశం కలిగిందని రైతులు చెబుతున్నారు. అంతేగాక పెద్దగా వేసవితాపం ప్రభావం కూడా లేకుండాపోయినందున చెట్లు గిడసబారిపోకుండా పెరుగుదలలో ఉన్నాయని ఆనందిస్తున్నారు జామాయిల్‌కు డీఏపీ, 20-20, యూరియా లాంటి ఎరువులకు కొరతలేకుండా అందించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

బాబోయ్.. కుక్కలు!



వలేటివారిపాలెం, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకర్లపాలెం, వలేటివారిపాలెం, పోకూరు, చుండి తదితర గ్రామాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడ కుక్కలు దర్శనమిస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. బస్టాండు సెంటర్లలోని మాసం దుకాణాలు వద్ద చికెన్, మటన్ వ్యర్థాలు విరివిగా దొరుకుతుండడంతో కుక్కల సంఖ్య గణనీయంగా పెరిగి చికెన్, మటన్ తీసుకెళ్లేవారి వెంట పడి దాడి చేస్తున్నాయి. వాహనాల వెంట పడి వాహనదారులను తరుముతున్నాయి. చిన్నపిల్లల వెంట పడి వారి చేతుల్లో ఉన్న తినుబండారాలను లాక్కెళ్లి గాయపర్చుతున్నాయి. రాత్రి వేళ్లలో కుక్కలు దెబ్బకు ప్రజలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. పగలు పొలాల్లో ఉన్న మేక, గొర్రెపిల్లలను చంపి తినేస్తున్నాయి. గత వారంలో మల్లెబోయిన కృష్ణయ్యకు చెందిన ఆరు గొర్రె పిల్లలను చంపి తిన్నాయి. దీంతో పాదచారులు, ఇటు ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు. కుక్కలను నియంత్రించాల్సిన పంచాయతీ అధికారులు తమ బ్యాధ్యత కాదులే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీవో నరేంద్రదేవ్‌ను వివరణ కోరగా కుక్కలు, కోతులు నియంత్రణకు చర్యలు చేపడతామన్నారు.

కనుల పండువగా హనుమంతుడి గ్రామోత్సవం

●ఉత్సవాల్లో అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన

కావలిటౌన్, మే 23(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం ముసునూరు మందాటి చెరువు వద్ద వెలసివున్న హనుమత్ క్షేత్రంలో జరుగుతున్న హనుమత్ జయంత్యుత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఉదయం అభిషేకాలు, నిత్య హోమం, పంచముఖ హనుమత్ గాయత్రి హోమం, మహా నివేదన, హారతి అనంతరం తీర్థప్రసాద వితరణ జరిగాయి. సాయంత్రం నిత్య హోమం, పూర్ణాహుతి ప్రత్యేక పూజలు జరిగాయి. రాత్రి ఆంజనేయస్వామి ఒంటె వాహనంపై మంగళ వాయిద్యాలు, బాణాసంచాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో రాముల వారికి మంగళ హారతి అందించిన జరిగిన చిన్నారుల నృత్యరూపం భక్తులను అలరించింది. మద్దూరుపాడు వీరాంజనేయస్వామి ఆలయంలోనూ ఉత్సవాలు ముగిశాయి.



ఒంటె వాహనంపై ఊరేగుతున్న ఆంజనేయస్వామి



మంగళహారతి నృత్య ప్రదర్శనలో చిన్నారులు

సీతారాములకు కుంభాభిషేకం




పూర్ణకుంభాలను తీసుకువస్తున్న ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు

అల్లూరు, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుగోగులపల్లి పంచాయతీ చంద్రశేఖరపురంలోని సీతారాముల ఆలయంలో శుక్రవారం మండల కుంభాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. నూతన ఆలయ నిర్మాణం సందర్భంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ చేపట్టి 48 రోజులు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్టు ఆలయ పాలక మండలి సభ్యులు తెలిపారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, సీతారాములకు పంచామృతాభిషేకం, మూలమంత్ర హోమాలు, కుంబాభిషేకం, ప్రత్యేక పూజ, మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని భక్తులు విశేషంగా పాల్గొని సీతారాములను దర్శించుకుని తీర్థప్రసాదములు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కీర్తి వెంకయ్య, ముంతా శ్రీనివాసులు, నెల్లూరు కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
శనివారం 24 మే 2025

కృష్ణతేజ సర్కిల్- శిలాతోరణం మార్గం వద్ద క్యూలో భక్తులు



కొండపై రద్దీ

వేసవి సెలవులు ముగింపునకు రావడం. వారాంతం కావడంతో శుక్రవారం నుంచే తిరుమల కొండపై భక్తుల రద్దీ పెరిగింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి ఉద్యానవనంలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ నుంచి రింగురోడ్డులోని శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వీరికి 16 గంటల దర్శన సమయం పడుతోంది. గదులు దొరక్క చాలామంది భక్తులు చెట్ల కింద, ఫుట్‌పాత్‌లపైనే సేదతీరుతున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

గొడుగు పట్టేవారు లేక..

15 నిమిషాలు ఆగిన గోదాదేవి ఊరేగింపు

గోవిందరాజస్వామి ఆలయంలో ఘటన



ఒకే గొడుగుతో నిలిచిఉన్న అమ్మవారి వాహనం

రెండో గొడుగు పట్టే వాళ్లు లేక.. తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలో గోదాదేవి అమ్మవారి ఊరేగింపు 15 నిమిషాల పాటు నిలిచిపోయింది. వివరాలిలా ఉన్నాయి. ప్రతి శుక్రవారం సాయంత్రం అమ్మవారిని ఊరేగించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా రెండు గొడుగులు పట్టాలి. గొడుగులు పట్టే నలుగురిలో ముగ్గురు సెలవులో ఉన్నారు. దీంతో శుక్రవారం సాయంత్రం ఊరేగింపులో ఒకరే.. ఒక గొడుగు పట్టారు. రెండో గొడుగు లేకపోవడంతో అర్చకులు ఊరేగింపునకు నిరాకరించారు. దీంతో దాదాపు 15 నిమిషాల పాటు ఊరేగింపు ఆగింది. ఈ విషయం తెలిసి అధికారులు మరో వాహనబేరరు ద్వారా గొడుగు పట్టించడంతో వాహనసేవ ముందుకు సాగింది. ముగ్గురు సెలవులో ఉన్నప్పుడు మరొకరిని ఎందుకు ఏర్పాటు చేసుకోలేదంటూ విమర్శలు వచ్చాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తీరంలో నత్తల వేట

- గుల్లను.. మాంసాన్ని వేరుచేసి విక్రయం
- రోజుకు వేలల్లో చంపేస్తున్న వైనం
- పర్యావరణానికి ముప్పంటున్నా పట్టించుకోని అక్రమార్కులు



గోవిందపల్లిపాళెం సమీపంలో కాల్చేందుకు సిద్ధంగా ఉన్న నత్తగుల్ల

డబ్బులొస్తాయంటే చాలు.. దేనికైనా తెగబడుతున్నారా వైసీపీ నేతలు. బకింగ్ హామ్ కెనాల్‌లో నత్తలను వేటాడుతున్నారు. నత్త గుల్లను.. మాంసాన్ని వేరుచేసి అక్రమార్జనకు పాల్పడుతున్నారు. నెలగా ఊపందుకున్న ఈ అక్రమ వ్యవహారాన్ని అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు.

- కోట, ఆంధ్రజ్యోతి



కాల్చగా.. సున్నానికి సిద్ధంగా ఉన్న గుల్ల

కోట మండలం సిద్దవరం ఎగువ గ్రామాల నుంచి బకింగ్‌హామ్ కెనాల్ ప్రారంభమై గోవిందపల్లిపాళెం ముఖద్వారం మీదుగా సముద్రంలోకి కలుస్తుంది. కాకినాడ నుంచి చెన్నై వరకు వెళ్లే ఈ బకింగ్ హామ్ కెనాల్‌లో బ్రిటీష్ కాలంలో జల రవాణా మార్గంగా ఉండేది. ప్రస్తుతం ఈ బకింగ్ హామ్ కెనాల్‌లో లక్షలాదిగా నత్తలు సంచరిస్తున్నాయి. కెనాల్‌లోనే గుడ్లుపెట్టి పొదిగి పిల్లలు కూడా ఉన్నాయి. ఈ నత్తలపై చిల్లకూరు మండలంలోని వరగరి గ్రామానికి చెందిన ఇద్దరు వైసీపీ నేతల కన్ను పడింది. గిరిజనులకు రోజు కూలీ ఎరచూపి రెండేళ్లుగా బకింగ్ హామ్ కెనాల్‌లోని నత్తలను ఏరేస్తున్నారు. ఇక, చెన్నై ప్రాంతం నుంచీ అప్పుడప్పుడు కొంతమంది వేటగాళ్లు వచ్చి ఈ కెనాల్‌లో నత్తలను జల్లెడ పడుతున్నారు. ఇలా.. వేల నుంచి లక్షలాది నత్తలను వలల ద్వారా పట్టుకుని.. ఒడ్డుకు చేర్చి బెంగళూరు, ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పలు రొయ్యల హేచరీలకు సరఫరా చేస్తున్నారు.

రొయ్యలకు ఆహారంగా నత్తమాంసం

కాలువ నుంచి బయటకు తీసిన నత్తలను చంపి.. గిరిజనుల చేత ఒలిపిస్తారు. గుల్ల నుంచి వేరుచేసిన నత్త మాంసాన్ని టన్నుల కొద్దీ మినీ వ్యాన్లలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పలు రొయ్యల హేచరీలతో పాటు చెన్నై, బెంగళూరుకు రవాణా చేస్తున్నారు. టన్ను నత్త మాంసం రూ.లక్షల్లో ఉంటుందని అంచనా. హేచరీలో ఉన్న తల్లి రొయ్యలకు ఈ నత్త మాంసాన్ని ఆహారంగా వేస్తారు. దీనివల్ల పిల్ల రొయ్య ఆరోగ్యవంతంగా పుడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇటీవల కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాల్లో రొయ్యల సాగు విస్తరిస్తూ ఇప్పుడిప్పుడే పుంజుకుంటుండగా హేచరీలకు నత్త మాంసం అవసరం కావడంతో అటువైపుగా ఈ రవాణా జరుగుతోంది.

మిగిలిన గుల్లను పొడిచేసి..

అదేవిధంగా మాంసం తీయగా మిగిలిన నత్త గుల్లను బకింగ్ హామ్ కెనాల్ ఉన్న గోవిందపల్లి, గోవింద పల్లిపాళెం వద్ద గుంతలు తవ్వి.. అందులో వేసి కాలుస్తారు. ఇలా కాల్చిన గుల్లను బాగా పొడి చేసి వచ్చిన సున్నాన్ని టన్నుల లెక్కన రొయ్యల సాగు యజమానులకే విక్రయిస్తారు. ఈ నత్తగుల్ల సున్నం రొయ్యల గుంటల అడుగుభాగంలో చల్లితే రొయ్యలకు ఎంతో బలాన్ని ఇస్తుందని ఆక్వా టెక్నీషియన్లు చెబుతున్నారు. దీంతో ఆ వైసీపీ నాయకులు నత్తగుల్లల సున్నాన్ని రూ.వేలల్లో విక్రయాలు జరుపుతున్నారు.

నత్తలతో పర్యావరణానికి మేలంటున్నా..

నత్తలు ఉండడం వల్ల పర్యావరణానికి ఎలాంటి ముప్పు కలగకుండా ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయినా, నత్తలను వేటాడేస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న ఈ అక్రమ వ్యాపారం ఆరు నెలల వరకు ఆగిపోయి ఉంది. మళ్లీ నెల రోజులుగా సముద్ర తీర ప్రాంత గ్రామాల్లోని బకింగ్ హామ్ కెనాల్‌లో ఊపందుకుంది. కోట మండలంలోని పలు సముద్ర తీర ప్రాంతాల మీదుగా వెళ్లే బకింగ్ హామ్ కెనాల్‌లో నత్తల అక్రమ వేట యథేచ్ఛగా సాగిపోతోంది.



నత్తగుల్లను కాల్చేందుకు కెనాల్ ఒడ్డున తవ్విన గుంత



దివాకర్‌రెడ్డి దంపతులకు శ్రీవారి చిత్రపటం బహూకరిస్తున్న అదనపు ఈవో వెంకయ్య చౌదరి, టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి

తొలి ప్రాధాన్యం భక్తులకే!

- టీటీడీ ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ప్రమాణం చేసిన తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి

తిరుమల, మే 23 (ఆంధ్రజ్యోతి): తన తొలిప్రాధాన్యం తిరుమలకు వచ్చే భక్తులకేనని టీటీడీ ఎక్స్‌అఫీషియో సభ్యుడు దివాకర్‌రెడ్డి చెప్పారు. తుడా చైర్మన్‌గా నియమితుడైన ఆయన శుక్రవారం ఉదయం టీటీడీ ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ప్రమాణం చేశారు. శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి వద్ద టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆయనతో ప్రమాణం చేయించారు. రంగనాయక మండపంలో వేద ఆశీర్వచనం స్వీకరించారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ తనకు ఈ అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. తుడా ద్వారా ప్రజలకు మంచి రోడ్లు, ఇతర సౌకర్యాలు కల్పించడంతో పాటు శ్రీవారి ప్రతిష్ఠ మరింత పెరిగేలా విధులు నిర్వహిస్తానన్నారు. ప్రతిరోజు ఎంతోకొంత సమయం శ్రీవారి భక్తుల సౌకర్యాల కల్పనపైనే దృష్టిసారిస్తానన్నారు. కాగా, ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ప్రమాణం చేయడానికి కుటుంబ సభ్యులతో కలిసి దివాకర్‌రెడ్డి శ్రీవారి మెట్టు నుంచి కాలిబాటన తిరుమలకు వెళ్లారు.

అది వైసీపీని సమాధి చేసిన రోజు

పార్లమెంటు మినీ మహానాడులో నేతల విమర్శ

తిరుపతిలో ఎన్టీఆర్ స్మారక భవనం ఏర్పాటు చేయాలని తీర్మానం



అమరవీరులకు సంతాపంగా మౌనం పాటిస్తున్న నేతలు

తిరుపతి, మే 23 (ఆంధ్రజ్యోతి): 'వెన్నుపోటు దినంగా జూన్ 4వ తేదిని జరుపుకోవాలని జగన్మోహన్ రెడ్డి చెబుతున్నారు. కానీ, అది ప్రజలు మీ పార్టీని సమాధి చేసిన రోజనే విషయం గుర్తుపెట్టుకోండి' అని టీడీపీ జోనల్ కోఆర్డినేటర్ దీపక్ రెడ్డి, పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్ వ్యాఖ్యానించారు. తిరుపతిలో శుక్రవారం నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన పార్లమెంటు నియోజకవర్గ మినీ మహానాడు జరిగింది. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ 2029 నాటికి రాష్ట్రంలో వైసీపీ ఉండదని జోస్యం చెప్పారు. వైజాగ్‌లో రూ.99కే ఎకరా ఇచ్చి ఉంటే ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేస్తామన్నారు. 15 ఏళ్ల పాటు చంద్రబాబు సీఎంగా ఉంటేనే రాష్ట్రం బాగుపడుతుందని దీపక్ రెడ్డి అన్నారు. వైసీపీ హయాంలో నాసిరకం మద్యం విక్రయించి ప్రజల ప్రాణాలు తీశారన్నారు. కడపలో జరిగే మహానాడుకు పెద్దఎత్తున తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. ఏపీజీబీఏ చైర్‌పర్సన్ సుగుణమ్మ, ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్, బొజ్జల సుధీర్, నెలవల విజయశ్రీ, టీటీడీ సభ్యురాలు పనబాక లక్ష్మి, శాప్ చైర్మన్ రవి నాయుడు తీర్మానాలను బలపరిచారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, మునిరామయ్య, నెలవల సుబ్రమణ్యం, పరసారత్నం, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు శ్రీధర్ వర్మ, కోడూరు బాలసుబ్రమణ్యం, పులిగోరు మురళి, రుద్రకోటి సదాశివం, శ్రీపతి బాబు, రెడ్డివారి గురవారెడ్డి, చిట్టిబాబు, చినబాబు, మహేష్ యాదవ్, సూరా సుధాకర్ రెడ్డి, బుల్లెట్ రమణ, కుమారమ్మ, ఊట్ల సురేంద్ర నాయుడు, మన్నెం శ్రీనివాసులు, కొట్టే హేమంత్, కృష్ణ యాదవ్, కరాటే చంద్ర, జయరామి రెడ్డి, శాంబోళ హరినాథ్, సతీష్ నాయుడు, పుష్పావతి, సుబ్బు యాదవ్, యశ్వంత్ రెడ్డి, ఆర్సీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. మొదటగా పహల్గాం మృతులకు, వీరసైనికులకు, మృతిచెందిన పార్టీ కార్యకర్తలకు నివాళులర్పించారు.

తీర్మానాలివి

- తిరుపతిలో ఎన్టీఆర్ స్మారక భవనం ఏర్పాటు చేయాలి
- శరబయ్య శ్రీవారి పీఠం ఏర్పాటుచేయాలి
- బీసీ, కాపు, జగజ్జీవన్, అంబేడ్కర్ భవనాలు నిర్మించాలి
- ఈద్గా మైదానాన్ని వారికి పూర్తిస్థాయి హక్కులు కల్పించాలి
- టీటీడీ ఉద్యోగులు, జర్నలిస్టులకు నివాస స్థలాలు కేటాయించాలి
- పేదలైన కార్యకర్తల డేటా సేకరించి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి
- వైసీపీ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులకే మళ్లీ అవకాశం ఇవ్వాలి.



ఎందుకైనా మంచిదని..!

రుయాలో సిద్ధం చేసిన కొవిడ్ పరీక్షా కేంద్రం, పడకలు

తిరుపతి(వైద్యం), మే 23(ఆంధ్రజ్యోతి): విశాఖలో కొవిడ్ కేసు నమోదు కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కొవిడ్ కట్టడికి తిరుపతిలో ముందస్తుగా సన్నద్ధమవుతున్నారు. రుయా, స్విమ్స్ ఆస్పత్రుల్లో కొవిడ్ కేంద్రాలను, ప్రత్యేక వార్డులను సిద్ధం చేశారు. జిల్లాలో కొవిడ్ లక్షణాలు లేవని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని వైద్యాధికారులు అంటున్నారు. అయితే, ముందు జాగ్రత్తలు, నిబంధనలు పాటించడం మంచిదని సూచిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో రుయాలో 20 పడకలతో ప్రత్యేక వార్డును సిద్ధం చేసినట్లు సూపరింటెండెంట్ రాధ చెప్పారు. జిల్లాలో లక్షణాలు లేకున్నా, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికుల ప్రాంతం కావడంతో తిరుపతిలో కొవిడ్ పరీక్షా కేంద్రాలను, మందులను, సిబ్బందిని సిద్ధం చేశామని డీఎంహెచ్‌వో డాక్టర్ బాలకృష్ణ నాయక్ తెలిపారు.

ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.17 లక్షల విరాళం



తిరుమల, మే23(ఆంధ్ర జ్యోతి): టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు శుక్రవారం రూ.17 లక్షలు విరాళంగా అందింది. హైదరాబాద్‌కు చెందిన పవర్‌మెక్ ప్రాజెక్ట్ లిమిటెడ్ ఎండీ సత్యరోహిత్ ఈ విరాళాన్ని అందజేశారు. రంగనాయక మండపంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి దాత విరాళం డీడీని అందజేశారు. వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ఒక పూట మధ్యాహ్నం భోజనం వడ్డించేందుకు వినియోగించాలని దాత కోరారు.

అదనపు ఈవోకు డీడీ అందజేస్తున్న దాత సత్యరోహిత్

'ఘాటు' రోడ్డుగా మార్చేస్తే ఎలా?



తిరుమల పవిత్రతకు భంగం వాటిల్లేలా ఘాట్‌లో మద్యం సీసాలు, గుట్కా ప్యాకెట్లు కనిపిస్తున్నాయి. ఈ క్షేత్రంలో మద్యం, మాంసం, పొగాకు ఉత్పత్తులు నిషేధం. వీటిని అలిపిరి వద్ద తనిఖీల్లోనే గుర్తించి అడ్డుకోవాలి. అక్కడి భద్రతా సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తరచూ నిషేధిత వస్తువులు కొండకు వస్తూనే ఉన్నాయి. ఈక్రమంలోనే మొదటి ఘాట్‌రోడ్డులో పలు చోట్ల ఖాళీ మద్యం సీసాలు, వాడేసిన గుట్కా ప్యాకెట్లు, సిగరెట్ ప్యాకెట్లు ఉండటం భక్తులను ఆవేదనకు గురిచేస్తోంది. ఈమార్గంలో మరమ్మతు పనులు చేస్తున్న కొందరు కార్మికులే వీటిని వాడుంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 16 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.74 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 72,579

తలనీలాలు సమర్పించినవారు: 34,067

శ్రీవారి సేవకు ప్రత్యేక శిక్షణ



'శ్రీవారి సేవ'ను మరింత మెరుగ్గా తీర్చిదిద్దేలా టీటీడీ చర్యలు చేపట్టింది. ఆరు నెలలపాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చాక సేవకులకు అవకాశం కల్పించాలని భావిస్తోంది. తద్వారా భక్తులకు మరింత బాధ్యతగా సేవలు అందించేలా ప్రణాళిక సిద్ధం చేస్తోంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సీఎం ఆదేశాలతో...

భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు దేశంలో పేరొందిన ఆధ్యాత్మిక సంస్థల నిర్వహణా పరమైన సూచనలను, సలహాలను తీసుకోవాలని టీటీడీని సీఎం చంద్రబాబు ఆదేశించారు. దీంతో సత్యసాయి సేవా సంస్థ, ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఈషా ఫౌండేషన్‌లను ఇప్పటికే టీటీడీ అధికారుల బృందం సందర్శించింది. అలాగే శ్రీవారిసేవ నిర్వహణకు సంబంధించి సత్యసాయి సేవా సంస్థ కూడా మార్చి నెలలో ఐదురోజుల పాటు తిరుమల, తిరుపతిలో పర్యటించి నివేదికను టీటీడీ అందజేసింది.

- ఆ తర్వాతనే సేవకులుగా అవకాశం
- ప్రణాళిక రూపొందిస్తున్న టీటీడీ

శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో 2000 నవంబరు 1న టీటీడీ 'శ్రీవారిసేవ'ను ప్రారంభించింది. 195 మందితో ప్రారంభమైన ఈ సేవలో ఇప్పటివరకు 16 లక్షల మంది పురుషులు, మహిళలు పాల్గొన్నారు. ఇప్పుడు వివిధ విభాగాల్లో రోజుకు 2,500 మంది సేవలందిస్తున్నారు. ప్రస్తుతం వచ్చే శ్రీవారి సేవకుల్లో 10 శాతం పాతవారుంటే.. 90 శాతం కొత్తవాళ్లు. ఈక్రమంలో సేవలు అందించే విధానంలో కొన్ని లోపాలు ఎదురవుతున్నట్టు తమ పరిశీలనలో అధికారులు గుర్తించారు. రానున్న రోజుల్లో 50 శాతం చొప్పున కొత్త, పాత వారికి సేవ చేసే అవకాశం కల్పించాలని టీటీడీ భావిస్తోంది. ఇందులో భాగంగానే ఎలాంటి సమయ నిబంధన లేకుండా త్వరలో ఓపెన్ రిజిస్ట్రేషన్ ప్రారంభించాలనే యోచనలో ఉంది. సేవకు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఆరు నెలల పాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని భావిస్తోంది. దీనికి తిరుపతితో పాటు మండల, జిల్లాస్థాయిల్లో ప్రత్యేక శిక్షకులతో శిక్షణ ఇచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇలా శిక్షణ పొంది సేవకు వచ్చేవారికి తిరుమలలోని పలు విభాగాల్లో సేవ చేసే అవకాశం కల్పిస్తారు. వీరికి సీనియర్లుగా ఉన్న సేవకులను గ్రూప్‌లీడర్‌గా ఏర్పాటు చేస్తారు. వీరు పర్యవేక్షకులుగా ఉంటూ సేవకుల పనితీరును పరిశీలించి రికార్డు చేస్తారు. మెరుగైన సేవలు అందించే వారి ఆధార్ సహా పూర్తివివరాలను టీటీడీ డేటాబేస్‌లో నమోదు చేస్తారు. ఇలా కొంతకాలం నిర్వహిస్తే శ్రీవారి భక్తులకు సేవకుల ద్వారా నాణ్యమైన సేవలు అందించవచ్చని టీటీడీ భావిస్తోంది. మరోవైపు ప్రస్తుతమున్న ఏడు రోజుల సేవే కాకుండా నెల, మూడు నెలల సేవలను కూడా ప్రారంభించాలని టీటీడీ ఆలోచనలు చేస్తోంది. ముఖ్యంగా వివిధ దేశాల్లో స్థిరపడిన భక్తులు కూడా సేవ చేసేందుకు మక్కువ చూపుతున్న క్రమంలో త్వరలో 'ఎన్ఆర్ఐ శ్రీవారిసేవ'ను కూడా ప్రారంభించాలని భావిస్తున్నారు. ఇక, 'వృత్తిపరమైన సేవ' కింద వైద్యం, ఐటీ, డెయిరీఫాం విభాగాల్లో ఉన్నతస్థాయిలో ఉన్నవారికి కూడా సేవచేసేందుకు అవకాశమివ్వాలని టీటీడీ ప్లాన్ చేస్తోంది.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

యోగాపై అవగాహన కల్పించండి

తిరుపతి(కలెక్టరేట్), మే 23(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర-2025పై ప్రజలకు అవగాహన కల్పించి నిర్వహణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో యోగాంధ్ర-2025 నిర్వహణపై జేసీ శుభం బన్సల్, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్యతో కలిసి వర్చువల్ విధానంలో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి జూన్ 21వ తేదీ వరకు యోగా మాసంగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు, విజయవంతానికి అవసరమైన ప్రణాళికను సిద్ధం చేయాలని కోరారు. 29న తిరుపతి, జూన్ 4న చంద్రగిరికోట, 11న శ్రీకాళహస్తి/శ్రీహరికోట, 17న శ్రీహరికోట/శ్రీకాళహస్తిలో యోగాపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీవోలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

తిరుమలలో రాఘవేంద్రరావు





మంత్రి రాంప్రసాద్‌రెడ్డి - బండ్ల గణేష్, కేవీ రావు, రాఘవేంద్రరావు, సతీష్ వేమన

తిరుమల, మే23(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు దర్శించుకున్నారు. ఇంకా నిర్మాతలు బండ్ల గణేష్, కేవీ రావు, మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, శంకరనారాయణ పీఠాధిపతి జగద్గురు కంచి స్వామి ఉన్నారు. అంతకు ముందు రాఘవేంద్రరావు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు. దర్శనం తర్వాత రాఘవేంద్రరావు మీడియాతో మాట్లాడుతూ, పుట్టిన రోజున తాను స్వామి అభిషేక సేవలో పాల్గొనడంతో తన జన్మ ధన్యమైందన్నారు. శ్రీవారి సేవలకు తాను ఎప్పుడూ సిద్ధంగానే ఉంటానన్నారు. కాగా, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడిని దర్శకుడు రాఘవేంద్రరావు, నిర్మాత బండ్ల గణేష్, తానా మాజీ అధ్యక్షుడు సతీష్ వేమన మర్యాదపూర్వకంగా కలిశారు.

నాయుడుపేట సీహెచ్‌సీలో రహస్యంగా అంతర్గత విచారణ

నాయుడుపేట టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఉన్నతాధికారులు రహస్యంగా శుక్రవారం విచారణ చేపట్టారు. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ శాఖ విజయవాడ ఆధ్వర్యంలో డాక్టర్ నాగలక్ష్మి విచారణ అధికారిగా తన బృందంతో విచారణ సాగించారు. ఆమెతో పాటు బృంద సభ్యులంతా సాధారణ రోగులతో కలిసి ఉదయం 9 నుంచి రాత్రి 11.30 గంటల వరకు పలు వివరాలు సేకరించారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రకళపై పలు ఆరోపణలు రావడంతో ఈ విచారణ చేపట్టారు. ఆస్పత్రిలో ఓపీలు ఇచ్చే విధానం, సిబ్బంది పనితీరు, ఔషధాల పంపిణీ, ల్యాబ్‌ల పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. పలు ఫైళ్లను పరిశీలించారు. రక్తనిధికి సంబంధించిన నిధులు, హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ (హెచ్‌డీఎస్) కమిటీని ఇంత వరకు నియమించకపోవడం దాని ద్వారా దాదాపు 7.5 లక్షల రూపాయలు నిధులు వెనక్కు మళ్లినట్లు గుర్తించారు. నాయుడుపేట సీహెచ్‌సీ పనితీరుపై సమగ్ర నివేదికను డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఉన్నతాధికారులకు అందించనున్నారు.

అట్టహాసంగా సీపీఎల్ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి(క్రీడలు), మే 23(ఆంధ్రజ్యోతి): తారకరామ మైదానంలో శుక్రవారం ఉదయం చిత్తూరు ప్రీమియర్ లీగ్ సీజన్ 1 పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన నగర కమిషనర్ మౌర్య క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఐపీఎల్ తరహాలో సీపీఎల్ మ్యాచ్‌లు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. ఇక్కడే ప్రతిభకు పునాదులు వేసుకోవాలని, ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సీడీసీఏ అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఇక్కడ సత్తాచాటిన క్రీడాకారులకు ఐపీఎల్, జాతీయ జట్లలో స్థానం లభించే అవకాశాలున్నాయన్నారు.

తొలిరోజు ఫలితాలిలా...

● మొదటి పోటీలో హైపీరియన్ జట్టుపై ఆదిత్య జట్టు విజేతగా నిలిచింది. అభిషేక్‌రెడ్డి 80 పరుగులు సాధించి ఆదిత్య జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అతన్ని మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు వరించింది. ● రెండో పోటీలో రాయల్‌చాలెంజ్ జట్టుపై పాయ్‌వైస్రాయ్ జట్టు గెలుపొందింది. సూర్య 33 పరుగులు, రెండు వికెట్లు పడగొట్టి పాయ్‌వైస్రాయ్ జట్టు విజయానికి బాటలు వేశాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుకు ఎంపికయ్యాడు.

దుగరాజపట్నంలో పోర్టు నిర్మించాలి

- మాజీ ఎంపీ చింతా మోహన్ డిమాండ్



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేస్తున్న చింతా మోహన్

గూడూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): దుగరాజపట్నంలో నౌకానిర్మాణ కేంద్రం కాదు, మేజర్ పోర్టు కావాలి అని మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలిపిన ఆయన, అనంతరం ప్రదర్శనగా సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు వెళ్లారు. ఈ సందర్భంగా చింతామోహన్ మాట్లాడుతూ డాక్టర్ మన్మోహన్ సింగ్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రపంచంలోనే అతిపెద్ద 5వ పోర్టుకు ఇక్కడ అనుమతిచ్చిందన్నారు. ఇది పూర్తి చేయకుండా ప్రజల చెవిలో పూలు పెడుతున్నారని విమర్శించారు. మేజర్ పోర్టు నిర్మాణం పూర్తయితే వందల సంఖ్యలో పరిశ్రమలు వస్తాయన్నారు. ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందన్నారు కాగా నిరుద్యోగ బ్రాహ్మణులు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీలకు ఇసుక, క్వార్ట్జ్, సిలికా వంటి సహజ సంపదను కేటాయించాలన్నారు. కృష్ణా నదిలో కడుతున్న అమరావతి రాజధాని సక్సెస్ కాదని అన్నారు. అక్కడ నిర్మాణ వ్యయం పదింతలు పెరుగుతుందని, కూటమి నేతలు పునరాలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణ, వెంకటయ్య, శివ, పెంచలయ్య, పూల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

యశ్వంతపూర్-హౌరా ఎక్స్‌ప్రెస్ 4 గంటలు ఆలస్యం

తిరుపతి(సెంట్రల్), మే 23(ఆంధ్రజ్యోతి): యశ్వంతపూర్-హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ శుక్రవారం 4 గంటలు ఆలస్యంగా తిరుపతికి చేరుకుంది. దీంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. తిరుపతికి నాలుగు గంటలకు చేరుకోవాల్సి ఉండగా రాత్రి 8గంటలకు వచ్చింది. ప్రయాణికులు సకాలంలో చేరుకోలేక తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. మరో వైపు హౌరాకు వెళ్లాల్సిన ప్రయాణికులు కూడా స్టేషన్‌లో పడిగాపులు కాయాల్సి వచ్చింది. ప్రారంభ స్టేషన్‌లోనే ఆలస్యంగా బయలుదేరినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

నడిరోడ్డుపై మందుబాబు హల్‌చల్



శ్రీకాళహస్తి, మే 23(ఆంధ్రజ్యోతి): నడిరోడ్డుపై బైఠాయించి మద్యం తాగుతూ మందుబాబు హల్‌చల్ చేశాడు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్టీసీ కూడలి నిత్యం రద్దీగా ఉండే మార్గం. శుక్రవారం ఓ మందుబాబు మద్యం కొని పక్కనే ఉన్న కూల్‌డ్రింక్ షాపుకు వెళ్లాడు. గ్లాసు, నీరు, కూల్‌డ్రింక్, చిప్స్, ఇతర ఆహార పదార్థాలు కొన్నవారినే మద్యం తాగేందుకు అనుమతిస్తామని నిర్వాహకులు తెలిపారు. దాంతో ఉచితంగా మద్యం తాగేందుకు పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేయాలంటూ అతడు నడిరోడ్డుపై మందు సీసాతో తిష్టవేశాడు. రెండో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మందుబాబును అదుపులోకి తీసుకుని బహిరంగంగా మద్యం తాగడంపై కేసు నమోదు చేశారు.

రూ.765 కోట్లు కావాలి

- బాలాజీ, మల్లిమడుగు రిజర్వాయర్లకు ప్రతిపాదన పంపిన జీఎన్ఎస్ఎస్

రేణిగుంట, మే 23 (ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా ఉన్న బాలాజీ, మల్లిమడుగు రిజర్వాయర్ల పనులకు రూ.765 కోట్లు కావాలని గాలేరు నగరి సుజల స్రవంతి(జీఎన్ఎస్ఎస్) డివిజన్ అధికారులు ప్రతిపాదనలను పంపించారు. తిరుమల శ్రీవారి భక్తులకు, తిరుపతి, చుట్టుపక్కల ప్రాంతాలకు తాగునీరు అందించేందుకు, అలాగే కాలువ నిర్మాణాలకు టెండర్లను పిలిచి గతంలో ఉన్న చంద్రబాబు ప్రభుత్వం పనులు అప్పగించింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ.. బాలాజీ, మల్లిమడుగు ప్రాజెక్టులను గాలికి వదిలేసింది. గతేడాది సీఎం అయిన చంద్రబాబు ఈ రిజర్వాయర్లపై సమీక్ష నిర్వహించి బ్యాలెన్స్ పనులను అంచనాలు పంపాలని ఆదేశించారు. దీంతో రూ.765 కోట్లు అంచనా వేసి ప్రతిపాదనలు పంపించామని జీఎన్ఎస్ఎస్ సబ్ డివిజన్ మల్లిమడుగు డీఈ చంద్రమౌళి తెలిపారు.

ఎంత కట్టినా.. తీరని బాకీ!

- పలు లోన్ యాప్‌ల తీరు
- వీరి వేధింపులతో ప్రాణాలు కోల్పోతున్న బాధితులు

● తిరుపతి మధురానగర్‌కు చెందిన 30 ఏళ్ల యువకుడు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. అక్కడ లోన్‌యాప్‌లలో రుణాలు తీసుకున్నాడు. ఎంత కట్టినా బకాయిలు ఉన్నాయంటూ నిర్వాహకులు వేధించారు. మరోవైపు లక్షలాది రూపాయలు అప్పుల పాలై తీర్చలేక తిరుపతికి వచ్చి ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు.

● తాజాగా శుక్రవారం తిరుపతిలోని ఆర్.వెంకటేశ్వర రాజు (30) కూడా లోన్‌యాప్ నిర్వాహకుల వేధింపులకు బలయ్యాడు. జిల్లాలో ఇలాంటి ఘటనలు ఎన్నో ఉన్నాయి. ఇందులో కొన్ని బయటకు రాకపోగా.. కొన్ని మాత్రం కేసులు నమోదవుతున్నాయి.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

ఇటీవల కొందరు యువత బెట్టింగ్ యాప్‌లకు అలవాటు పడుతున్నారు. బెట్టింగులో రూ.లక్షలాదిగా నష్టపోతున్నారు. అలాంటి సమయాల్లో వీరి సెల్‌ఫోన్లకు లింకులు వస్తున్నాయి. అడగకపోయినా రుణాలు ఇస్తామంటూ మెసేజీలు పంపుతున్నారు. ఎలాగైనా బెట్టింగులో పోయిన డబ్బులు రాబట్టుకోవాలని యువత ఈ లింకులను క్లిక్ చేస్తున్నారు. రుణాలు పొందుతున్నారు. ఈ క్రమంలో వీరి ఫోనులోని కాంటాక్టు ఫొటో గ్యాలరీ యాక్సిస్‌ను నిర్వాహకులు తీసుకుంటారు. దీని వల్ల ఫోన్‌లోని ఫొటోలు, కాంటాక్టు నెంబర్లు వంటి వివరాలన్నీ యాప్‌ల నిర్వాహకుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి. లోన్ మంజూరు చేసిన తర్వాత రోజు నుంచి చెల్లింపుల కోసం ఒత్తిడి ప్రారంభిస్తారు. వాయిదాలను సకాలంలో కట్టకపోయినా, చెప్పినంత వడ్డీ చెల్లించక పోయినా ఫోన్‌లోని కాంటాక్టు నెంబర్లకు మార్ఫింగ్ చేసిన ఫొటోలు పంపిస్తామని బెదిరిస్తున్నారు. కొన్ని యాప్‌ల నిర్వాహకులైతే అసలు, వడ్డీ చెల్లించినా ఇంకా బకాయి ఉందంటూ వేధిస్తున్నారు. కాంటాక్ట్ నెంబర్లకు పంపిస్తామని బెదిరిస్తుండటంతో బాధితులు బలవన్మరణానికి పాల్పడుతున్నారు. ఈ ఘటనల్లో కేసులు నమోదైనా.. దొంగపత్రాలతో సిమ్ కార్డులు, బ్యాంకు ఖాతాలు ఉండటంతో యాప్ నిర్వాహకులు చిక్కడం లేదు.

లోన్‌యాప్‌ల వలలో పడొద్దు

యువకులు, విద్యార్థులు, మహిళలు లోన్ యాప్‌ల జోలికి వెళ్లొద్దు. గుర్తు తెలియని వ్యక్తులు పంపే మెసేజ్‌లు, లింక్‌లను ఓపెన్ చేయొద్దు. లోన్‌యాప్‌ల ఉచ్చులో పడి మోసపోవద్దు. లోన్‌యాప్‌ల మోసాలపై ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపడుతున్నాం. **- వినోద్‌కుమార్, సైబర్ క్రైం సీఐ**

లోన్ యాప్ వేధింపులకు యువకుడి బలి



ఆత్మహత్యకు పాల్పడిన వెంకటేశ్వరరాజు

తిరుపతి(నేరవిభాగం), మే 23(ఆంధ్రజ్యోతి): లోను యాప్ నిర్వాహకుల వేధింపులు భరించలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం తిరుపతిలోని పెద్దకాపు లేఅవుట్‌లో చోటు చేసుకుంది. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. ఆర్మీ విశ్రాంత ఉద్యోగి ఆర్.రామచంద్రరాజు కుమారుడు వెంకటేశ్వర రాజు బీ-టెక్ వరకు చదివాడు. ఈ క్రమంలో బెట్టింగ్ యాప్‌కు అలవాటుపడ్డాడు. రూ.లక్షల్లో అప్పులు చేశాడు. ఈ క్రమంలో తన మొబైల్‌కు వచ్చిన మెసేజీల ద్వారా లోన్ యాప్‌ల నుంచీ రుణం పొందాడు. మొత్తమ్మీద రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు అప్పులయ్యాయి. ఇటీవల లోన్‌యాప్ నిర్వాహకుల వేధింపులు ఎక్కువ కావడంతో, తండ్రికి విషయం చెప్పాడు. కుమారుడికి బుద్ధులు చెప్పిన ఆయన.. తిరుపతిలోని ప్లాటు అమ్మి రూ.25 లక్షల వరకు అప్పు తీర్చారు. అయినా, ఇంకా రుణం చెల్లించాలని నిర్వాహకుల నుంచి ఒత్తిడి పెరిగింది. ఈ క్రమంలో వెంకటేశ్వరరాజు శుక్రవారం అమ్మవారి ఆలయానికి వెళ్లొచ్చాడు. తల్లిదండ్రులు బంధువుల ఇంటికి వెళ్లడంతో.. ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందాడు. ఇంటికొచ్చిన తల్లిదండ్రులు తలుపులు తీసి చూసే సరికి కుమారుడు ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెంది ఉన్నాడు. ఈ ఘటనపై ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు.

మద్యం షాపుల వద్ద నిరంతర నిఘా

- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్



తిరుపతిలోని దుకాణం వద్ద ఎక్సైజ్ అధికారుల నిఘా

తిరుపతి(నేరవిభాగం), మే 23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మద్యం షాపుల వద్ద నిరంతర నిఘా ఉంచినట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ చెప్పారు. తిరుపతి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో శుక్రవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎక్సైజ్ అధికారుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మద్యం షాపులకు సంబంధించి తనిఖీల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిర్దేశిత సమయాలను పాటించాలన్నారు. మద్యం దుకాణాల వద్ద బహిరంగంగా తాగినా, అనధికార పర్మిట్ రూములు ఏర్పాటు చేసినా కేసులు నమోదు చేయాలన్నారు. దుకాణాల వద్ద గొడవలు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తిరుపతి జిల్లా ఏఈఎస్ వాసుదేవ చౌదరి, ఊహశ్రీ, ఈఎస్ శ్రీనివాసులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎక్సైజ్ సీఐలు పాల్గొన్నారు.

తాగునీరు, పారిశుధ్య నిర్వహణ

- నాయుడుపేటలో రూ.201.12 కోట్లతో

◆ రుణం కోసం కేంద్రానికి డీపీఆర్ పంపేందుకు మున్సిపల్ శాఖ అనుమతి

తిరుపతి, మే 23 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలో తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ ప్రాజెక్టు అమలు కోసం రూ. 201.12 కోట్ల రుణం కోసం కేంద్రానికి డీపీఆర్ పంపేందుకు రాష్ట్ర మున్సిపల్ శాఖ ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు అనుమతిచ్చింది. రాష్ట్రంలోని పలు పట్టణాలతో పాటు నాయుడుపేటకూ ఈ అనుమతి ఇచ్చారు. ఇందులో 85 శాతం అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ కింద, మిగిలిన 15 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వ వాటాగా కేటాయించాల్సి ఉంది. నాయుడుపేట పట్టణం విషయానికొస్తే 9బీ1 నుంచీ 9బీ5 వరకూ ఐదు ప్రాజెక్టులుగా ఈ పనులు జరగనున్నాయి. పనుల కోసం రూ. 176.06 కోట్లు, నిర్వహణ కోసం రూ. 25.06 కోట్లు చొప్పున మొత్తం రూ. 201.12 కోట్లు వ్యయం చేయనున్నారు.

ఆసియా ఆన్‌లైన్ చెస్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ

తిరుపతి(క్రీడలు) మే 23(ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఆలిండియా చెస్ ఫెడరేషన్ సౌజన్యంతో నిర్వహించిన ఫస్ట్ ఏషియన్ ఆన్‌లైన్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలో తిరుపతి జువైనల్ హోంలోని బాలబాలికల జట్టు ప్రతిభ కనబరిచాయి. మంగళంలోని బాలుర జువైనల్ హోం జట్టు ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది. రాజన్న పార్కు వద్దనున్న బాలికల జువైనల్ హోం జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించింది. ఆసియాలోని 19 దేశాల బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలను హైదరాబాదుకు చెందిన ఐఓసీఎల్ ప్రతినిధి తిమ్మప్ప, ఆర్బిటర్ మల్లికార్జున, కోచ్‌లు సుధాకర్, సదాశివన్ పర్యవేక్షించారు.

నిమిషం ఆలస్యమైనా అనుమతించం

- రేపు సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలు
- జిల్లాలో 13 కేంద్రాల ఏర్పాటు



తిరుపతి(కలెక్టరేట్), మే 23 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలు ఆదివారం జరగనున్నాయి. పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, యూపీఎస్సీ అబ్జర్వర్ హన్సవదన, ప్రత్యేకాధికారి, సంయుక్త కార్యదర్శి ఎస్‌జి అజ్మీర అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని 13 కేంద్రాల్లో ఆదివారం జరిగే ఈ పరీక్షలకు 5,261మంది హాజరుకానున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఉదయం 9.30 నుంచి 11.30గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు రెండు విడతల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదన్నారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు హాజరయ్యేలా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడండి



కమిషనర్‌తో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, మే 23 : (ఆంధ్రజ్యోతి) పట్టణంలో తాగునీటి సమస్య రాకుండా చూడాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ వెంకటగిరి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులరెడ్డిని ఆదేశించారు. శుక్రవారం ఆయన తన నివాసం లోని పార్టీ కార్యాలయంలో తాగునీరు, వీధిలైట్లు, పారిశుధ్యం వంటి మౌలిక వసతులపై కమిషనర్‌తో చర్చించారు. ప్రభుత్వం అన్నివిధాలా సహకరి స్తుందని తెలిపారు. తాను ఇకపై ప్రతి రోజూ సచివాలయం పరిధిలోని వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా పనిచేస్తామన్నారు. జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ అధ్యక్షులు గంగోటి నాగేశ్వరరావు, వెంకటగిరి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, దొంతు బాలకృష్ణ పాల్గొన్నారు.

మినీ మహానాడుకు తరలిన టీడీపీ నాయకులు



ఎమ్మెల్యే విజయశ్రీ, పార్థసారథితో ఉన్న టీడీపీ నాయకులు

పెళ్లకూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తిరుపతిలో శుక్రవారం జరిగిన మహానాడుకు తరలివెళ్లారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ మాజీ ఛైర్మన్ పేరం రమేష్‌నాయుడు, పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి దార్ల రాజేంద్ర, కలవకోలు మునీష్, కోటిరెడ్డి తదితరులు తరలివెళ్లారు.

గృహ నిర్మాణాలపై సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీడీఓ, హౌసింగ్ అధికారులు

కోట, మే 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పక్కాగృహ నిర్మాణాలపై శుక్రవారం సమీక్ష జరిగింది. ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్ హౌసింగ్ ఏఈ భాస్కర్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, ఉపాధి హామీ పథకం ఏపీఓ, వెలుగు ఏపీఎంలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి 1 నుంచి మే 23 వరకు నిర్ణయించిన లక్ష్యాలను అధిగమించడంలో పూర్తి సహకారం అందించాలన్నారు. అదేవిధంగా లక్ష్యాల్లో భాగంగా 160 పక్కా గృహాలకు గాను ఇప్పటివరకు 53 పక్కాగృహాల నిర్మాణం పూర్తి చేయగా మరో 107 గృహాలను పూర్తి చేసేందుకు పనులు వేగవంతం చేయాలన్నారు. 2022-23 పథకానికి సంబంధించి లింటిల్ లెవల్, రూఫ్ లెవల్, ఆర్‌సీలో ఉన్నటువంటి 107 పక్కాగృహాలను పూర్తి చేయాలన్నారు.

వేనాడు దావూద్‌షావల్లి అల్లాతాత దర్గా హుండీల లెక్కింపు

తడ, మే 23 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వేనాడు దీవిలో ఉన్న షేక్ దావూద్‌షావల్లి అల్లాతాత దర్గా హుండీలను శుక్రవారం లెక్కించారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అనుసరించి కలెక్టర్ సూచనలు మేరకు స్థానిక సర్పంచ్ కటారి అన్నపూర్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దర్గా ప్రాంగణంలోని అన్ని హుండీలను లెక్కించారు. మొత్తం రూ.13.41 లక్షలు భక్తులు బాబాకు కానుకలుగా సమర్పించారు. ఈ మొత్తాన్ని దర్గా పేరిట ఉన్న జాయింట్ అకౌంట్‌లో డిపాజిట్ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో రవీంద్రబాబు, ఎంపీడీవో శేఖర్‌నాయక్, ఎస్‌ఐ కొండప నాయుడు, పంచాయతీ కార్యదర్శి నరేష్, గాబ్రియల్, మస్తాన్, గ్రామపెద్దలు శ్రీరాములుమొదలి, వెంకటాద్రి, భాస్కర్, నరేష్, దేవేంద్ర పాల్గొన్నారు.

పేద విద్యార్థి చదువుకు చేయూత



నగదును అందజేస్తున్న దాత సందీప్ రెడ్డి, రహంతుల్లా

చిట్టమూరు, మే 23(ఆంధ్రజ్యోతి): కొత్తగుంట టీఎంఆర్ పాఠశాలలో ఇంటర్ చదివిన పేద విద్యార్థి భువన్‌కు శుక్రవారం నాయుడుపేటకు చెందిన పాపాడి సందీప్ రెడ్డి రూ.5వేల నగదును ప్రోత్సాహకంగా అంద జేశారు. భువన్ ఆర్థిక ఇబ్బందులను ప్రిన్స్‌పాల్ రహంతుల్లా సందీప్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆర్థికసాయం అందించారు.

ఇంటి పన్ను వసూలు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న
డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటరమణ, డీఆర్పీ రవి

చిట్టమూరు, మే 23(ఆంధ్రజ్యోతి): ఇంటి పన్ను వసూలు చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటరమణ, డీఆర్పీ రవి కార్యదర్శులను ఆదేశించారు. చిట్టమూరు మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం వారు సమావేశాన్ని నిర్వహించారు. స్వర్ణ పంచాయతీ, ఆధార్ సీడింగ్, ఇంటి పన్ను వసూళ్లు, సేల్స్ ప్రొసీడింగ్‌లపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ జనార్ధన్, చిట్టమూరు పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు ఉన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే గ్రీవెన్స్

సూళ్లూరుపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధి నిధులు పక్కదారి

ఎంపీడీవోకు కొత్తపట్నం సర్పంచ్ ఫిర్యాదు

కోట, మే 23 (ఆంధ్రజ్యోతి) : కొత్తపట్నం పంచాయతీలో ఉపాధి పనుల్లో అక్రమాలు జరుగుతున్నాయని నిధులు దుర్వినియోగం చేస్తున్నారని సర్పంచ్ తిరుపాలయ్య ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్‌కు గ్రామస్తులతో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పంచాయతీలో 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు చేసిన పనులకే మళ్లీ బినామీ పేర్లతో బిల్లులు స్వాహా చేస్తున్నారని తెలియజేశారు. అదేవిధంగా చిల్లకూరు మండలంలోని పలు పరి శ్రమలలో పనిచేసే ఉద్యోగులను ఉపాధి హామీ పనుల్లో కూలీలుగా చేర్చి వారి పేరుతో బిల్లులు పెట్టి నగదును స్వాహా చేస్తున్నారన్నారు. గతంలో పనిచేసిన ఫీల్డ్ అసి స్టెంట్‌ను పక్కన పెట్టి సర్పంచ్ తీర్మానం లేకుండానే మరో వ్యక్తిని మేట్‌గా నియమించి అతడితో నిధులు కాజేస్తున్నారని తెలియజేశారు. పనులకు రాకున్నా మస్టర్లు వేసి నిధులు స్వాహా చేస్తున్నారని పేర్కొన్నారు. కొత్తపట్నం పంచాయతీలో విచారణ జరిపి నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని కోరారు.



ఎంపీడీఓ దిలీప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న
కొత్తపట్నం సర్పంచ్ తిరుపాలయ్య, గ్రామస్తులు

వైభవంగా కుంభాభిషేక మహోత్సవం

పెళ్లకూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన చెంచులక్ష్మీ సమేత నరసింహస్వామి ఆలయంలో కుంభాభిషేక మహోత్సవం శుక్రవారం మూడోరోజు వైభవోపేతంగా నిర్వహించారు. అభిషేకం, మహామంగళహారతి, మంత్రపుష్పం, విగ్రహ ప్రతిష్ఠ, మూలమంత్ర మహాహోమం చేపట్టారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామి, అమ్మవార్లకు ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. స్వామిఅమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఎన్‌సీసీబీ మాజీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా తదితరులు పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయకమిటీ సభ్యులు పగడాల హరిబాబురెడ్డి, వనం ప్రశాంత్‌శర్మ, దువ్వూరు లక్షణ్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. టీడీపీ నాయకులు పెమ్మసాని ఆదిలక్ష్మి, ఆమె కుమారుడు సూరినాయుడు భక్తులకు అన్నదానం చేశారు.



స్వామిఅమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు

దళితవాడ పాఠశాల ఎత్తివేత

● గ్రామస్తుల ఆందోళన

కోట, మే 23 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఊనుగుంటపాళెం అరుంధతి వాడలోని ప్రాథమిక పాఠశాలను విద్యాశాఖ అధికారులు రేషనలైజేషన్ కింద ఎత్తివేసేందుకు రంగం సిద్ధం చేశారు. దీంతో అరుంధతి వాడ వాసులు 40ఏళ్లుగా ఉన్న ప్రాథమిక పాఠశాలను తమ వాడలోనే ఉంచాలంటూ అధికారులు, ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. ఇక్కడ అరుంధతి వాడలోని ప్రాథమిక పాఠశాలను 1984లో నిర్మించారు. ఈ పాఠశాలలో ఒకప్పుడు 1 నుంచి 5 తరగతులు ఉన్నప్పటికీ ప్రస్తుతం ఫౌండేషన్ స్కూల్ కింద 1, 2 తరగతులు నిర్వహిస్తూ ఒక ఉపాధ్యాయుడే ఉంటు న్నాడు. ఆ రెండు తరగతుల్లో నలుగురే విద్యార్థులు ఉన్నారు. 2025 - 26 విద్యా సంవత్సరానికి మరో ఆరుగురు విద్యార్థులు ఆ రెండు తరగతుల్లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని అరుంధతి వాడ వాసులు తెలిపారు. అయితే ఈ పాఠశాలను రేషనలైజేషన్ కింద ఎత్తి వేసేందుకు కోట మండల విద్యాశాఖ అధికారులు జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు. విద్యాశాఖ అధికారులు స్పందించి ఊనుగుంట పాళెంలో ఉన్న ఫౌండేషన్ పాఠశాలను కొనసాగించాలని కోరుతున్నారు.



ఊనుగుంటపాళెం అరుంధతివాడలో ఉన్న ప్రాథమిక పాఠశాల

జనసేన పార్టీ సభ్యత్వ నమోదుతో రూ.5లక్షల బీమా

● జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్

నాయుడుపేట, మే 23 (ఆంధ్రజ్యోతి) : జనసేనపార్టీ నాల్గవ విడత క్రియాశీలక సభ్యత్వాలు తీసుకున్నవారికి రూ.5లక్షల వరకు బీమా ఉం టుందని ఆ పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్ అన్నారు. నాయుడుపేట ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం జనసేన పార్టీ నాయకులకు, క్రియాశీల కార్యకర్తలకు, వలంటీర్లకు పార్టీ సభ్యత్వ నమోదు కిట్లను అందజేశారు. పార్టీ సభ్యత్వ నమోదును చేశారు. అనం తరం నియోజకవర్గంలో గతంలో అత్యధికంగా సభ్యత్వనమోదు చేసిన సూళ్లూరుపేట నాయకులు శంకు సురేష్‌ను అభినందించారు. పార్టీలో కష్ట పడి పనిచేసేవారికి ఎల్లప్పుడూ సముచిత స్థానం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు అట్ల కృష్ణారావు, గిండి సతీష్, బాలుశెట్టి, కిరణ్, సురేష్, శీను, కేశవరెడ్డి, శ్రీనివాస్, కాటయ్య, గురునాథం, కిరణ్, బాలాజీ, నాగరాజు, లోకేష్, పద్మజ, కామాక్షి, రోహిణి, సల్మా తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు చేస్తున్న ఉయ్యాల ప్రవీణ్

ప్రొటోకాల్ ఉల్లంఘనపై రైల్వే మంత్రికి ఫిర్యాదు చేస్తా

సూళ్లూరుపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో అమృత్ భారత్ పథకం కింద ఆధునికీకరణ చేశాక గురువారం జరిగిన రైల్వే స్టేషన్ ప్రారంభ వేడుకల్లో రైల్వే అధికారులు ప్రొటోకాల్ పాటించలేదని మున్సిపాలిటీ ఛైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రారంభోత్సవ వేడుకల్లో వేదికపైకి పట్టణ ప్రథమ పౌరుడైన మున్సిపల్ ఛైర్మన్‌ను రైల్వే అధికారులు పిలవకుండా అవమానించారని పేర్కొన్నారు. ప్రొటోకాల్ ఉల్లంఘనకు సంబంధించి రైల్వే అధికారులపై రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కి ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు, సోమవారం పలు రైళ్లు రద్దు

తడ, మే 23 (ఆంధ్రజ్యోతి): సదరన్ రైల్వే పరిధిలోని చెన్నై సూళ్లూరుపేటల మధ్య నేడు(శనివారం), సోమవారం రెండురోజులు పాటు పలు రైళ్ల రద్దు చేస్తున్నట్లు సదరన్ రైల్వే చెన్నై డివిజన్ అధికారులు శుక్రవారం ప్రకటించారు. తమిళనాడు పొన్నేరి కవరపేట రైల్వే స్టేషన్ మధ్య కొద్ది నెలలుగా ఇంజినీరింగ్ పనులు సిగ్నలింగ్ వ్యవస్థ పనులు జరుగుతున్నాయి. అందులో భాగంగా నేడు (శనివారం) సోమవారం రెండురోజులు పాటు ఉదయం 11.15 నిమిషాల నుంచి మధ్యాహ్నం 3.15 నిమిషాల వరకు నాలుగు గంటల పాటు ఆ పనులు నిర్వహించేలా అధికారులు నిర్వహించారు. దీంతో ఆ సమయంలో నడిచే పలు రైళ్లు పూర్తిగా రద్దుకాగా మరికొన్ని రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు.

● రద్దయిన రైళ్ల వివరాలు ఇలా

చెన్నై నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 10.15 నిమిషాలకు, మధ్యాహ్నం 12.10 నిమిషాలకు మధ్యాహ్నం 1.04 నిమిషాలకు చెన్నై నుంచి సూళ్లూరుపేటకు బయలుదేరి వచ్చే ఈఎంయూ రైళ్లను రద్దు చేశారు.

● సూళ్లూరుపేట నుంచి చెన్నైకు వెళ్లే ఉదయం 11.45, మధ్యాహ్నం 1.15, 3.10, రాత్రి 9.00 గంటలకు సూళ్లూరుపేట నుంచి చెన్నైకు వెళ్లే ఈఎంయూ రైళ్లను రద్దు చేశారు.

● రైలు నెంబరు 66037 సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు మధ్యాహ్నం 3.55 నిమిషాలకు బయలుదేరి వెళ్లే రైలు రద్దయింది.

● రైలు నెంబరు 66038 నెల్లూరు నుంచి సూళ్లూరుపేటకు సాయంత్ర 6.45 నిమిషాలకు బయలుదేరే మెమో రైలు రద్దయింది.

● చెన్నై నుంచి గుమ్మిడిపూడికి ఉదయం 10.30, 11.35, మధ్యాహ్నం 12.10, 12.40 ఈఎంయూ రైళ్లను రద్దు చేశారు.

● గుమ్మిడిపూడి నుంచి చెన్నైకు ఉదయం 10.55 మధ్యాహ్నం 1.00 గంట, 2.30, 3.15 నిమిషాలకు బయలుదేరి వెళ్లే ఈఎంయూ లోకల్ రైళ్లను రద్దు చేశారు. ఇలా మొత్తం 18 రైళ్లను రద్దు చేయగా మరికొన్ని పాక్షికంగా రద్దయ్యాయి.

జేమ్స్‌పై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

తిరుపతి రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని రాయలసీమ జిల్లాల విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కోరారు. ఎమ్మార్‌పల్లెలోని యూత్ హాస్టల్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, రాజ్‌కుమార్, మునీంద్రనాయక్, సరస్వతమ్మ, అరుద్ర శ్రీనివాస్ మాట్లాడుతూ దళిత విద్యార్థిపై దాడి కేసును ఈ నెల 16న నమోదు చేసినా ఇప్పటివరకు నిందితులను అరెస్ట్ చేయకపోవడం బాధాకరమన్నారు. పోలీసుల నిర్లక్ష్యం వల్ల బాధితులకు న్యాయం జరగడంలేదని ఆరోపించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. సభ్యులు శేషాద్రి, కృష్ణమూర్తి, రామకృష్ణ, వరలక్ష్మి, గంగాధర్, చిరంజీవి, నాగలక్ష్మి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లలో నాణ్యమైన ఆహారం అందించండి

తిరుపతి, మే5(ఆంధ్రజ్యోతి) : అన్న క్యాంటీన్ల ద్వారా నాణ్యమైన ఆహారం అందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య నిర్వాహకులను ఆదేశించారు. నగరంలోని అన్న క్యాంటీన్లను, తిమ్మినాయుడుపాలెం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. నగరంలోని నాలుగు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్లలో పేదలకు నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తిమ్మినాయుడుపాళెం ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాం సుందర్, మునిసిపల్ ఇంజనీర్ గోమతి, ఏసీపీ మూర్తి, డీఈ రమణ ఉన్నారు.

సిటీ డయాగ్నొస్టిక్‌పై సమీక్ష

తిరుపతి(కలెక్టరేట్), మే 23 (ఆంధ్రజ్యోతి): రుయా ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన సిటీ డయాగ్నొస్టిక్ సెంటర్, పరికరాలపై కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో శుక్రవారం సమీక్షించారు. సెంటర్‌కు కావాల్సిన పరికరాలు, ఖర్చుల వివరాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. మెడికల్ పరికరాల కొనుగోలుకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. సెంటర్‌లో డిప్యూటేషన్‌పై ల్యాబ్ టెక్నీషియన్ విధులు కేటాయించాలని జిల్లా వైద్యాధికారి బాలకృష్ణ నాయక్‌ను ఆదేశించారు. తిరుపతి పరిసర ప్రాంతాల్లో సుమారు 20 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి వచ్చే రోగులకు సంబంధించిన పరీక్షలు అన్నీ ఈ సెంటర్లో నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలి పారు. ఈ సమావేశంలో రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రాధా, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రభు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ఎయిడ్స్ పై అవగాహన



ఎయిడ్స్‌పై కళాబృందంతో అవగాహన కల్పిస్తున్న సంస్థ నిర్వాహకులు

సూళ్లూరుపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో నవజీవన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద మన సంస్కృతిక కళాబృందం సంస్థ వారిచే వీధి నాటకం ద్వారా ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ ఆర్గనైజేషన్ ప్రాజెక్టు మేనేజర్ బాలాజి, సభ్యులు మంజుల, నందిని, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల హర్షం



గేట్ సమావేశంలో హర్షం వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

సూళ్లూరుపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ఆర్టీసీలో నిలిపివేసిన 1/2019 ఉత్తర్వులను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించేందుకు నిర్ణయం తీసుకోవడంపై ఆర్టీసీ ఉద్యోగుల హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయంతో శుక్రవారం ఆర్టీసీ డిపో ముందు ఎన్‌ఎంయూ ఆధ్వర్యంలో జరిగిన గేటు మీటింగ్‌లో ఎన్‌ఎంయూ డిపో కార్యదర్శి ఎస్.సుబ్రమణ్యం మాట్లాడుతూ ఈ ఉత్తుర్వులను పునరుద్ధరించడం వల్ల ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లభిస్తుందన్నారు. చిన్న తప్పులకు సైతం శిక్షలు అనుభవిస్తున్న 48వేల మందికి ఈ ఉత్తర్వుల పునరుద్ధరణతో ఊరట లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయ కులు శేఖర్, కోటయ్య, సుబ్బయ్య, కాలేషా, హరీష్, మూర్తి, శశిధర్, మాధవ్, సునీల్, రఫీ, దొరసానమ్మ తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలి



హౌసింగ్ ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

నాయుడుపేట టౌన్, మే 23 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంతో పాటు, మండలం లోని అర్హులైన వారందరికీ పక్కాఇళ్లు మంజూరుచేయాలని బీజేపీ నాయకులు కోరారు. నాయుడుపేట గృహనిర్మాణశాఖ కార్యాలయంలో శుక్రవారం ఏఈ శ్రీనివాసులకు బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. నాయుడుపేట అర్బన్‌లో 258 మంది, మండలంలో 1319 మంది దరఖాస్తు చేసుకొని ఉన్నారని ఏఈ తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీజేపీ నాయకులు విజయభాస్కర్, చెంచుకృష్ణయ్య, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, రవి తదితరులు ఉన్నారు.

నాగరప్పమ్మ జాతర ప్రారంభం



ఆలయం వద్ద గ్రామ పొంగళ్లు పెడుతున్న మహిళలు

ఓజిలి, మే 23 (ఆంధ్రజ్యోతి) : ఓజిలిలో కొలువైన గ్రామ దేవత నాగారప్పమ్మ జాతరను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. మూడు రోజులపాటు జరగనున్న జాతరను పురస్కరించుకుని శుక్రవారం ఉదయం అంకురార్పణ, అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. రాత్రి అమ్మవారికి గ్రామ పొంగళ్లు పెట్టారు. శనివారం అమ్మవారి గ్రామోత్సవం, ఆదివారం బలి, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో ఆలయంతోపాటు ప్రధాన వీధులను శోభాయమానంగా అలంకరించారు. ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవకమిటీ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఆలయం వద్ద పోలీసు బందో బస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ ఆదిలక్ష్మి తెలిపారు.

ప్రసన్నాంజనేయ అలంకారం

సూళ్లూరుపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని బాలాంజ నేయ స్వామి ఆలయంలో జరుగు తున్న హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం హనుమంతుడు ప్రసన్నాంజనేయ అలం కారంలో భక్తులకు దర్శన మిచ్చారు. ఉదయం స్వామి వారికి అభిషే కానంతరం పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

